ఆంధ్రజ్యోతి

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 15 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా) 15-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	26
తెనాలి	38	27
నరసరావుపేట	39	27
బాపట్ల	38	28
రెంటచింతల	39	28
చీరాల	38	28



నిల్వ ఉంచిన పొగాకు బేళ్లు

బర్లీ మంటలు

- పొగాకు గిట్టుబాటు ధరపై ఆశలు ఆవిరి
- సమీక్షలకే పరిమితమవుతున్న పాలకులు
- పత్తాలేని కంపెనీలు.. ప్రభుత్వ ఆదేశాల బేఖాతరు

బర్లీ పొగాకు దిగుబడులు మొదలై రెండు నెలలు కావొస్తోంది. అప్పటి నుంచి పంట కు సరైన ధరలేక రైతులు తమ గోడు ప్రభుత్వానికి వెళ్లబోసుకుంటూనే ఉన్నారు. కనీస స్థాయిలో కూడా ధర పలకడం లేద ని వ్యాపారులు రకరకాల కొర్రీలతో మరీ తీసికట్టుగా అడుగుతున్నారని, ప్రభుత్వం తమ సమస్యపై దృష్టి పెట్టాలని పాలకులను అభ్యర్థిస్తూనే ఉన్నారు. రైతుల గోడును ఆలకించిన ప్రభుత్వం తాడేపల్లి వేదిక గా బర్లీ పొగాకు కొనుగోళ్లపై అటు అధికా రులతో ఇటు కంపెనీలతో సమీక్ష నిర్వ హించింది. కొనుగోళ్లను రోజు వారీ పర్యవేక్షించడానికి నలుగురు అధి కారులతో ఈ నెల 1 నుంచి గుంటూరు లోని పొగాకు బోర్డు కార్యాలయంలో కాల్ సెంటర్ సైతం ఏర్పాటు చేసింది. దీనికి కొనసాగింపుగా వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ కూడా క్షేత్ర స్థాయిలో పొగాకు రైతుల వెతల ను పరిశీలించడానికి పర్చూరు బాట పట్టారు. ఇదంతా కూడా పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోసం రెండు వారాల వ్యవధిలో ప్రభుత్వం వైపు నుంచి వచ్చిన కదలిక.

మూడు జిల్లాల పరిధిలో 96,000 వేల ఎకరాల వరకు..

గడచిన రెండేళ్ల బర్లీ పొగాకు సాగు రైతాంగానికి కొద్దిపాటి లాభాలను తెచ్చిపెట్టింది. దీంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున రైతాంగం దాని వైపు మళ్లింది. సంప్రదాయ సాగు అయిన మిర్చి, పత్తిని కాదని కూడా రైతులు బర్లీ బాట పట్టారు. బర్లీసాగు బాపట్ల జిల్లాలో 70,000 ఎకరాలు ఉండగా ఇది రాష్ట్రంలోనే అత్యధికంగా నిలిచింది. సాగు మొత్తం పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోనే ఉంది. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో మరో 26,000 ఎకరాల వరకు సాగైంది. దిగుబడులు మొదలై దాదాపు రెండు నెలలు కావొస్తోంది. ఇప్పటికీ దాదాపు 60,000 ఎకరాల్లో పంట రైతుల వద్దనే ఉంది. గతేడాది క్వింటా పొగాకు ధర గరిష్ఠంగా రూ.16,000 వరకు పలికింది. దిగుబడి ఎకరాకు 15 క్వింటాల వరకు రావడంతో రైతులు ఒడ్డున పడ్డారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. రెండు వా రాల క్రితం వరకు కనీసం 8 నుంచి రూ.9,000 వరకు కొనే వ్యాపారులైన గ్రామాల్లో కనబడేవారని ప్రస్తుతం ఆ ధరకు కూడా అడిగే నాధుడు కనబడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాపట్ల, మే 14, (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోళ్లపై ప్రభుత్వం అత్యం త ప్రాధాన్య అంశంగా తీసుకుని రివ్యూ లు జరిపినా, పొగాకు కంపెనీలను కొనుగోళ్ల కోసం దాదాపుగా హెచ్చరించి నా రైతులకు దక్కిన ప్రయోజనం గుండుసున్నా. రెండు వారాల క్రితం వరకు ధర దిగదిడుపుగా అడిగే వ్యాపారులు అయినా వచ్చేవారని, ఇప్పుడు కనీసం పొగాకును అడిగే నాధుడే కరువయ్యారని రైతాంగం కన్నీరు మున్నీరవుతోంది. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్న దశలోనే ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకుని తీవ్రతను తెలియజేశారు. ఈ ఘటన జరిగి వారం రోజులు గడవక ముందే ఇంకొల్లు మండలానికి చెందిన మరో రైతు బలవన్మరణానికి ప్రయత్నించగా సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇదే పరిస్థితి కొనసాగితే తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం కనబడడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధర విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే తప్ప పొగాకు కంపెనీలు మొద్దు నిద్ర వీడవని రైతాంగం వాపోతోంది.

సమీక్షలకే పరిమితమైన ప్రభుత్వం..

సమస్య తీవ్రతను గుర్తించిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విషయాన్ని వ్యవసాయశాఖ దృష్టికి నెల రోజుల క్రితమే తీసుకెళ్లారు. అధికారులు, కంపెనీలు, రైతు సంఘాలనాయకులను ఒకే వేదికమీదకు తీసుకొచ్చి రైతులకు ఏ విధంగా చేస్తే మేలు జరుగుతుందనే అంశంపై కసరత్తు చేశారు. దీని ఫలితమే గుంటూరులో కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం కానీ, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి క్షేత్రస్థాయి పర్యటనకు రావడం కానీ జరిగింది. కానీ ప్రభుత్వం వైపు నుంచి కంపెనీలకు కొనుగోళ్లపై ఆదేశాలు ఇవ్వడంతోనే సరిపెట్టారు తప్పితే వాటి అమలుపై పర్యవేక్షణే కరువయింది. గుంటూరులో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ అలంకార ప్రాయమే తప్ప దాని వల్ల రైతులకు జరిగిన లబ్ధి ఏంటంటే అధికారుల వద్దే సమాధానం లేకపోవడం గమనార్హం. బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల అందరి పరిస్థితి దాదాపుగా ఉరి కొయ్యకు వేలాడుతున్నట్లే ఉంది. ప్రభుత్వమే స్వయంగా రంగంలోకి (మిగతా 8వ పేజీలో)

- మార్గం మధ్యలోనే మొరాయిస్తున్న వాహనాలు
- అత్యవసర సేవలకు ఆటంకాలు
- ఎక్కడా ప్రాణాపాయం లేకున్నా... ఎప్పుడు... ఎక్కడ ఆగేనో! ఆ దేవుడికే ఎరుక
- గత ప్రభుత్వ పాలనలో నిర్వహణ లోపాలు
- కొత్త వాహనాలు మంజూరు చేయకుంటే ప్రాణాలకు నో గ్యారెంటీ

108కి.. సుస్తీ

మనలో ఎవరైనా ప్రమాదానికి గురైతేనో!, లేక ఏదైనా అనారోగ్య సమస్య ఏర్పడితేనో వెంటనే గుర్తొచ్చేది 108 వాహనం. అయితే మన ప్రాణాలు అత్యవసర సమయాల్లో కాపాడే ఆ 108కే కష్టమొస్తే? ప్రతి క్షణం విరామం లేకుండా పరుగులు పెట్టాల్సిన వాహనం మధ్యలో సుస్తీ చేసి ఆగిపోతే? ఏ అర్ధరాత్రి సమయంలోనో మనలో ఎవరైనా అత్యవసర చికిత్స అవసరమై 108 వాహనంలో వెళుతున్నప్పుడు వ్యాన్ ముందుకు వెళ్లకుండా మొరాయిస్తే? తలచుకుంటేనే వెన్నులో వణుకు పుడుతుంది కదూ!. ఒక్కసారిగా ప్రాణం పోయినంత భయం కలుగుతుంది కదూ!... అవును. ప్రస్తుతం అత్యసర సమయంలో సంజీవనిలా పరుగులుపెట్టే 108 వాహనాలకు నిర్వహణా లోపం సమస్యగా మారింది.



వేమూరు మార్కెట్ యార్డు దగ్గర టైర్ మార్చాల్సి రావటంతో మరో 108 వాహనం నుంచి టైర్ తీసి మార్చుకునే స్థితి

తెనాలి, మే 14 (ఆంధ్రజ్యోతి): చాలాచోట్ల 108 పాత వాహనాలకు గత ప్రభుత్వ కాలంలో పైపై మెరుగులుదిద్ది రోడ్డుమీదకు వదిలేయటంతో అవి ముందుకు వెళ్లనంటూ మొరాయిస్తున్నాయి. చిలకలూరిపేట హైవేపై గుంటూరు వెంగళాయపాలెం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి 1.40 గంటల సమయంలో ఒక 108 వాహనాన్ని మరో 108 వాహనం లాక్కెళుతూ కనిపించింది. ఒక రోగిని అత్యవసర వైద్యసేవ కోసం తీసుకెళుతున్న సమయంలో మొరాయించటంతో మరో వాహనం ఆగమేఘాలమీద వచ్చి దానిని లాక్కెళ్లిందనేది సమాచారం. అయితే రోగికి మాత్రం ప్రాణాపాయం ఏమీ జరగకపోవటం ఊపిరి పీల్చుకునే విషయం. మంగళవారం సాయంత్రం వేమూరు మార్కెట్ యార్డ్ 108 వాహనం టైర్లు దెబ్బతింటే మరో వాహనం వచ్చి, దాని టైర్‌ను తీసి ఆగిన వాహనానికి అమర్చి ముందుకు కదిలించారు. ఇలా అనేక ఉదాహరణలు ఈ మధ్య కాలంలో కనిపిస్తూనే ఉన్నాయి. దీనంతటికీ కారణం... వాహనాల నిర్వహణ సరిగా లేకపోవటం, గత ప్రభుత్వ కాలంలో వీటిని సరిగా పట్టించుకోకపోగా, విజయవాడ, తాడేపల్లి మెకానిక్ షెడ్‌లలో పైపై మెరుగులద్ది యధావిధిగా వెనక్కు పంపేయటంతో కష్టాలు తప్పటంలేదు. పాతవాటి నిర్వహణ తీరు ఇట్లాఉంటే... ఎప్పుడో రోడ్డెక్కిన పాత వాహనాల స్థానంలో కొత్తవి మంజూరు చేయకపోవటం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ఒకే వాహనం అందుబాటులో ఉంచటంతో అవి విరామం లేకుండా తిరగాల్సి రావటం అవి మొరాయించటానికి కారణమవుతోంది.



నిర్వహణ సరిగాలేక మధ్యలోనే ఆగిపోయిన 108 వాహనం

కూత కూయలేక.. ముందుకు కదల లేక..

108 వాహనం అంటే పైన వెలిగే లైట్లు, కుయ్... కుయ్ మంటూ కూత వేసుకుంటూ అత్యవసర సేవలను గుర్తుచేస్తూ పరుగులుపెట్టే వాహనాలే గుర్తొస్తాయి. అయితే ఇప్పుడు చాలా వాహనాలు కూత (మిగతా 8వ పేజీలో)



నేటి నుంచి వైకుంఠపురం బ్రహ్మోత్సవాలు

18న వేంకటేశ్వరస్వామి కల్యాణం.. 19న రథోత్సవం

తెనాలి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని వైకుంఠపురం శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఏసీ మంతెన అనుపమ బుధవారం తెలిపారు. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 15న స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి అంకురారోపణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 16న నిత్యహోమం, బలిహరణ, శేష వాహన గ్రామోత్సవం, 17న గజవాహన గ్రామోత్సవం, 18న ఎదురు కోలోత్సవం, స్వామి వారి కల్యాణం, 19న గరుడోత్సవం, దివ్య రథోత్సవం, 20న వసంతోత్సవం, శ్రీచక్ర స్నానం, పూర్ణాహుతి పూజలు, 21న ద్వాదశ ప్రదక్షిణలు, ఏకాంత సేవ జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజు ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

డీసీపీ సత్యనారాయణపై చర్యలకు ఆదేశాలు

టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై ప్రభుత్వ ఉత్తర్వులు

గుంటూరు కార్పొరేషన్, మే 14(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని కాకాని రోడ్డులో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. 2022లో కాకానీ రోడ్డు నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ రోడ్డు విస్తరణ పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయి. విస్తరణలో భాగంగా భవనాలు, స్థలాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం కింద కొంతమేరకు నగదు, మరికొంత మొత్తానికి టీడీఆర్ బాండ్లను జారీ చేశారు. ఈ టీడీఆర్ బాండ్ల జారీలో గోల్‌మాల్ జరిగింది. అప్పట్లో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతిపై బాధిత రైతులు నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రభుత్వ ఉన్నతాధికారులు అప్పటి డీసీపీ సత్యనారాయణ(రిటైర్)పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలంటూ జీవో 445ను రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరి ఎస్ సురేష్‌కుమార్ బుధవారం జారీ చేశారు.

కార్మికుల కోసం.. ఈ-శ్రమ్

పోర్టల్‌లో నమోదును వేగవంతం చేయాలి

గుంటూరు(తూర్పు), మే 14 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల కోసం బహుళ ప్రయోజకారిగా కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు డీఆర్వో షేక్ ఖాజావలి తెలిపారు. పోర్టల్‌లో కార్మికుల నమోదుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో డీఆర్వో తన కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 9,93,379 లక్షల మంది కార్మికులు ఉండగా 6,63,212 మంది మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. డీఆర్డీఏ, మెప్మా, డ్వామా, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ శాఖలో ఉన్న కార్మికులను గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోలేదని, వారిని గుర్తించాలన్నారు.

విపత్తు వేళ రక్షణపై అవగాహన

కలెక్టరేట్‌లో ఉత్కంఠగా మాక్‌డ్రిల్

గుంటూరు(తూర్పు), మే 14 (ఆంధ్రజ్యోతి): బుధవారం ఎవరూ ఊహించనట్లుగా కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాదం. పలు శాఖల కార్యాలయాల్లో దట్టంగా పొగ.. ఆందోళనలో ఉద్యోగులు.. భయంతో కొందరు బయటకు పరుగులు.. లోపల భయంతో మరికొందరు ఉక్కిరిబిక్కిరి. అదే సమయంలో సైరన్ మోగడం.. ఆ వెంటనే జిల్లా విపత్తుల నిర్వహణ బృందం (ఎన్‌డీఆర్‌ఎఫ్), ఆపదమిత్ర, ఎస్డీఆర్‌ఎఫ్, పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, వైద్య, మున్సిపల్ శాఖల సిబ్బంది రంగంలోకి దిగింది. ప్రమాదంలో చిక్కుకున్న ఉద్యోగుల తరలింపు.. నిచ్చెన, రోప్ సాయంతో కిందకు చేర్చారు. వారికి వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించడం.. కొందర్ని అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలింపు.. పేలుడు పదార్థాల కోసం డాగ్ స్క్వాడ్ తనిఖీ లు.. దీంతో కలెక్టరేట్‌లో ఉన్న సామాన్య ప్రజలు బీతిల్లారు. ఆ తర్వాత అది మాక్‌డ్రిల్ అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

అవగాహన కల్పించేలా మాక్‌డ్రిల్

కలెక్టరేట్‌లో జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ పీడీ లక్ష్మీకుమారి పర్యవేక్షణలో రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల సమన్వయంతో అగ్ని ప్రమాదంపై మాక్‌డ్రిల్ అవగాహన కల్పించేలా సాగింది. కార్యక్రమాన్ని పరిశీలించిన డీఆర్వో షేక్ ఖాజావలి మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించినపుడు సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన నష్ట నివారణ చర్యలను మాక్‌డ్రిల్ ద్వారా ప్రత్యక్షంగా చూపించారన్నారు. ప్రతి కార్యాలయంలో ఫైర్ పరిక రం ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ప్రాణ, ఆస్తి నష్ట నివారణ ప్రధాన ఉద్దేశమన్నారు. మాక్‌డ్రిల్‌లో ఎన్డీఆర్‌ఎఫ్ ఇద్దర్ని, ఎస్డీఆర్‌ఎఫ్ ముగ్గురిని, ఫైర్ సిబ్బంది నలుగురిని, ఆపద మిత్ర ఇద్దరిని రెస్క్యూ చేసినట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో డా. విజయలక్ష్మి మాట్లాడుతూ మాక్‌డ్రిల్‌లో 74 మందిని రెస్క్యూ చేసి ప్రథమ చికిత్స అందించామన్నారు. జీజీహెచ్‌కు ఇద్దర్ని తరలించామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఆర్ఎఫ్‌వో జిలాని, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణావతార్, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్ర రావు, హెచ్ సెక్షన్ పర్యవేక్షకురాలు మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో ఖాజావలి, జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ పీడీ లక్ష్మీకుమారి, డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి



ప్రమాదంలో చిక్కుకున్న కలెక్టరేట్ సిబ్బందిని రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుంటూరు వేదికగా.. సర్వేపై వర్క్‌షాప్

నేడు, రేపు నిర్వహణ.. వివిధ రాష్ట్రాల అధికారుల రాక

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండి యా ల్యాండ్ రికార్డ్స్ మోడర్నైజేషన్ ప్రోగ్రాం (డీఐఎల్‌ఆర్‌ఎంపీ) కింద సర్వే/రీసర్వేపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారం నుంచి రెండు రోజుల పాటు గుంటూరులో జరగనుంది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని కేంద్ర ప్రభు త్వాన్ని ఈ వర్క్‌షాప్ నిర్వహణకు ఒప్పించారు. గుం టూరులోని ఐటీసీ హోటల్‌లో జరిగే ఈ కార్యక్రమా నికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు అస్సాం, కర్ణాటక, రాజ స్థాన్, కేరళ, బీహార్, హరియాణ రాష్ట్రాల నుంచి సర్వే అధికారులు హాజరుకానున్నారు. గతంలో నేషనల్ ల్యాండ్ రికార్డ్ మోడర్నైజేషన్ ప్రోగ్రాం(ఎ న్‌ఎల్‌ఆర్ ఎంపీ)గా ఉన్న దీనిని కేంద్ర ప్రభుత్వం డీఐఎల్‌ఆర్ ఎంపీగా మార్పు చేసింది. డీఐఎల్‌ఆర్‌ఎంపీ ద్వారా ఆధునిక, సమగ్ర, పారదర్శకతతో కూడిన ల్యాండ్ రి కార్డు మేనేజ్‌మెంట్ సిస్టమ్ అభివృద్ధి చేస్తారు. గురు వారం వర్క్‌షాప్‌ని కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభిస్తారు. డీవోఎల్‌ఆర్ జాయింట్ సెక్రటరి కునాల్ సత్యార్థి ప్రారంభోపన్యాసం చేస్తారు. శుక్రవారం వర్క్‌షాపులో ఉదయం కేరళ, బీహార్, లద్ధాక్, హరియాణల నుంచి వచ్చిన అధికారులు ప్రజంటేషన్ ఇస్తారు.



రైల్వేస్టేషన్‌కు సిందూర కాంతులు

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో బుధవారం గుంటూరు రైల్వేస్టేషన్‌ను మువ్వన్నెల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో రైల్వేస్టేషన్ ఈస్టు, వెస్టు టెర్మినల్స్ కొత్తరూపు సంతరిం చుకున్నాయి. డివిజన్ పరిధి లోని మరికొన్ని రైల్వేస్టేషన్లను కూడా త్రివర్ణ పతాక రంగుల కాంతులతో అలంకరించారు.

సర్వర్.. సంకటం



8

- మొరాయిస్తున్న రైస్ కార్డు సర్వర్
- మూడు రోజులుగా అదే పరిస్థితి
- వందల్లో వస్తున్న దరఖాస్తులు..
- రోజుకు ఒకటి రెండు దరఖాస్తులతో సరి
- తలలు పట్టుకుంటున్న సచివాలయ సిబ్బంది

షానూన్‌కు అంతర్జాతీయ పతకం తెనాలికే గర్వకారణం



పవర్ లిఫ్టర్ షానూన్‌ను సత్కరిస్తున్న డబుల్ హార్స్ ఎండీ శ్యాంమోహన్‌ప్రసాద్

తెనాలి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పవర్ లిఫ్టింగ్ పోటీలలో తొలి అంతర్జాతీయ పతకం రావడం తెనాలికి గర్వకారణమని డబుల్ హార్స్ సంస్థ ఎండీ మునగాల శ్యాంమోహన్ ప్రసాద్ చెప్పారు. స్థానిక క్విక్ జిమ్‌లో శిక్షణ పొంది పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్ మదిర షానూన్‌ను బుధవారం జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఆసియా సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణి నాలుగు గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంచ్ పతకాలు సాధించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగంలో భారతదేశ ప్రతిష్ఠ ఇనుమడింపజేసే విధంగా శిక్షణ పొందాలని చెప్పారు. పతకాలు సాధించేందుకు కృషి చేసిన కోచ్‌లు ఘట్టమనేని సాయిరేవతి, పూసపాటి శివరామకిరణ్‌రాజులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో ఏఐ ఆధారిత గుండె వైద్యచికిత్సలు



ఏఐ బేస్ట్ టెక్నాలజీతో డాక్టర్లు నాగార్జున, హేమసుందర్

గుంటూరు మెడికల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కోస్తాంధ్రాలో మొట్టమొదటి సారిగా ఏవీవీఐజీవో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంట్రావ్యాస్క్యులర్ అల్ట్రా సౌండ్ (ఐవీఎస్‌యూ) గైడెడ్ పర్‌క్యుటేనియస్ కరోనరీ ఇంటర్వెన్షన్ (పీసీఐ)ను శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఈ అధునాతన ప్రక్రియ కృత్రిమ మేధ ఆధారిత ఇమేజింగ్‌ను రియల్ టైమ్ ఇంట్రావ్యాస్క్యులర్ విజువలైజేషన్‌తో అనుసంధానం చేస్తుంది. దీనివల్ల శస్త్రచికిత్స సమయంలో రోగుల రక్తనాళాల కొలతలు, నాళాల్లో పేరుకుపోయిన కొవ్వు పరిమాణం, స్టెంట్ పొజిషన్‌ను ఖచ్చితంగా అంచనా వేసేందుకు వీలు కలుగుతుంది. శస్త్రచికిత్స సమయాన్ని తగ్గించడంతో పాటు సురక్షితమైన ఫలితాలను అందిస్తుంది. ఈ సందర్భంగా గుజ్జనగుళ్ల సెంటర్‌లోని శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి, క్యాథ్ ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ హేమసుందర్ కొర్రపాటి మాట్లాడుతూ ఈ అధునాతన వ్యవస్థ సంక్లిష్టమైన కరోనరీ రక్తనాళ గాయాలకు చికిత్స చేయడంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. క్లిష్టమైన రక్తనాళాల సమస్యలతో బాధపడుతున్న రోగికి శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో ఏవీవీఐజీవో టెక్నాలజీని ఉపయోగించి చికిత్స చేసినట్లు వారు వెల్లడించారు. హైడెఫినిషన్ ఏఐ బేస్డ్ పవర్డ్ ఇమేజింగ్ పరిజ్ఞానంతో రేడియేషన్ తగ్గించే సరైన స్టెంట్ ప్లేస్‌మెంట్‌ను చేసినట్లు తెలిపారు. రోగి పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు.

విస్తృతమైన పరిశోధనలతో రైతులకు మేలు

● డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఢిల్లీరావు



టెక్నాలజీ ఇన్వెంటరీ సీడీని ఆవిష్కరిస్తున్న ఢిల్లీరావు, శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ)మే 14(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల విస్తృతమైన పరిశోధనలు చేయటం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్ ఢిల్లీరావు పేర్కొన్నారు. బుధవారం లాంఫాంలోని అచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యాన్యువల్ రివ్యూ, యాక్షన్ ప్లాన్ మీటింగ్ ఆఫ్ కేవీకే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని 23 కృషి విజ్ఞాన కేంద్రాలకు సంబంధించిన 2025-26 సంవత్సరంలో చేపట్టవలసిన ప్రణాళికలపై వ్యవసాయ విశ్వవిద్యాలయం, అటారి జోన్-ఎక్స్ సంయుక్తంగా మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాల్లో విస్తరణ శాస్త్రవేత్తలు రైతుస్థాయిలో చర్చలు జరపాలన్నారు. రైతుల సమస్యలు గుర్తించి పరిష్కారాలు చూపాలన్నారు. పరిశోధనా శాస్త్రవేత్తలు ఎక్కువగా రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా పరిశోధనలు జరిపి వారు ఆర్థికంగా స్థిరపడేలా చూడాలన్నారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు రైతుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా పరిశోధన శాస్త్రవేత్తలు ముందుకు వెళ్లాలన్నారు. పరిశోధన సత్ఫలితాల డాక్యుమెంటేషన్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అటారి జోన్ ఎక్స్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు, విస్తరణ కేంద్రాలు మాత్రమే కాదని, పరిశోధనా సంస్థలుగా కూడా జిల్లా స్థాయిలో వ్యవహరించాలన్నారు. విశ్వవిద్యాలయం సహకారంతో జిల్లా స్థాయిలో డ్రోన్ పైలెట్ శిక్షణ సంస్థలుగా వ్యవహరించాలని కోరారు. అనంతరం టెక్నాలజీ ఇన్వెంటరీ సీడీని, కేవీకే ఘంటసాల, కలికిరి, గుంటూరు వారు తయారు చేసిన ప్రచురణలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ, వైఎ స్సార్ హర్టికల్చర్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు, కేవీకేల శాస్త్రవేత్తలు, పరిశోధన సంచాలకులు పాల్గొన్నారు.

కొండవీడుకోటను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దండి

కేంద్రమంత్రిని కోరిన ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి



కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక కొండవీడుకోటను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కేంద్ర పర్యాటక శాఖామంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో కలసి కేంద్ర మంత్రిని కలసిన ప్రత్తిపాటి ఈ మేరకు విజ్ఞప్తి చేస్తూ కొండవీడుకోట సమగ్రాభివృద్ధిపై చర్చించారు. గొప్ప సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతం కొండవీడుకోట ఏపీ రాజధాని అమరావతికి అతి సమీపంలో ఉన్నదని, సహజసిద్ధమైన సరస్సులతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యకలాపాలకు అనువైన ప్రదేశమని, అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాంత అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా కొండవీడు ప్రాంతాన్ని ఇన్ క్రెడిబుల్ ఇండియా, దేఖో అప్నా దేశ్ విభాగాల క్రింద విస్తృత ప్రాచుర్యం కల్పించాలని కోరారు.

జాతీయ సర్క్యూట్‌లో చేర్చండి

కొండవీడుకోటను జాతీయ వారసత్వ సర్క్యూట్‌లో చేర్చాలని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో కొండవీడుకోటకు ఖ్యాతి ఇనుమడిస్తుందన్నారు. కోటను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకోసం ఫుడ్ కోర్టులు, రోప్‌వే మార్గం, మౌళిక వసతుల కల్పనకు కేంద్రం నుంచి నిధులు వచ్చేలా చూడాలని అభ్యర్థించారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన కెన్యా బృందం



కెన్యా ప్రతినిధులతో విజ్ఞాన్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు (విద్య) మే 14 (ఆంధ్రజ్యోతి):భారత్, కెన్యా దేశాల మధ్య అకడమిక్, పరిశోధనలు, అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మసీ, బయో మెడికల్, స్కిల్ డెవలప్‌మెంట్, డ్రోన్ టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని కెన్యాలోని విహిగ కౌంటీ గవర్నర్ హెచ్‌ఈ డాక్టర్ విల్బర్ కే ఒట్టిచిలో అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీని కెన్యా దేశానికి చెందిన ప్రతినిధులు సందర్శించారు. దౌత్య సంబంధాలపై ప్రతినిధులు మాట్లాడారు. ఫుడ్, టెక్నాలజీ, విద్యా ఉద్యోగ అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో కెన్యా దేశానికి చెందిన 8 మంది ప్రతినిధులు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కర్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగం డెయిరీని ఆదర్శంగా తీసుకుంటాం : కెన్యా ప్రతినిధులు



సంగం డెయిరీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న విహిగ కౌంటీ గవర్నర్ విల్బర్ బృందం

పొన్నూరుటౌన్, మే 14: సంగం డెయిరీని కెన్యా దేశంలోని విహిగ కౌంటీ రాష్ట్ర గవర్నర్, కెన్యా హెల్త్ కమిటీ చైర్మన్ హెచ్‌ఈ డాక్టర్ విల్బర్ కే ఒట్టిచిలో బృందం బుధవారం సందర్శించింది. సంగం డెయిరీ నిర్వహణ, తయారు చేస్తున్న ఉత్పత్తులు, రైతు సమాఖ్యల గురించి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విల్బర్ బృందానికి వివరించారు. సంగం డెయిరీలోని వివిధ విభాగాలను కెన్యా బృందం సందర్శించి అధునాతన ప్లాంట్‌లను పాలు ప్రాసెసింగ్ చేసే విధానాలు, పాల నుంచి ఉప ఉత్పత్తుల తయారీ వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్, డాక్టర్ విల్బర్ మాట్లాడుతూ డెయిరీ రంగం ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు రైతాంగాన్ని వృద్ధి పథంలో నడిపేందుకు సంగం డెయిరీని సందర్శించినట్లు చెప్పారు. సహకార వ్యవస్థ ద్వారా రైతుల భాగస్వామ్యంతో అభివృద్ధి చెందుతున్న సంగం డెయిరీని ఆదర్శంగా తీసుకుని కెన్యా దేశంలో కూడా డెయిరీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. డెయిరీని సందర్శించిన వారిలో కెన్యా బృంద సభ్యులు డాక్టర్ ఫ్రెడ్రిక్, కౌంటీ అసెంబ్లీ ఎంసీఏ టౌన్ టిర్రా, హెల్త్ సర్వీసెస్ ముఖ్య అధికారిణి డాక్టర్ మేరీ సుసాన్, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిస్టోఫర్, మెడికల్ ఆఫీసర్ ఎలిజెబెత్, వెలాసిటీ ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ హరిమూర్తి, ప్రెస్ యూనిట్ డైరెక్టర్ ట్రాన్సిస్టో తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● కేజేఎస్ఎస్ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సామినేని కోటేశ్వరరావు

గుంటూరు (తూర్పు), మే 14(ఆంధ్ర జ్యోతి): గుంటూరు బృందావన్ గార్డెన్స్ లోని కమ్మ బాలికల వసతి గృహంలో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. వసతి గృహ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఆపై చదువుతున్న పేద, ప్రతిభ కల్గిన విద్యార్థినులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. దేశంలో ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. దరఖాస్తులను వసతి గృహంలో గాని "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కమ్మజనసేవా సమితి. కామ్"అనే వెబ్‌సైట్‌లో నేటి నుంచి అందు బాటులో ఉంచామని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను, ఇతర సర్టిఫికెట్స్ జతపరిచి ఈనెల 29వ తేదీ లోపు వసతి గృహంలో నేరుగా అందజేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను కార్యాలయంలోని నోటీసు బోర్డుపై, వైబ్‌సైట్‌లో పొందు పరుస్తామన్నారు. 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాల చదివి ప్రతిభ చూపిన విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ 7వేలు చొప్పున కుల, మతాలకు అతీతంగా ఉపకారవే తనాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 0863- 2355471, 2260666 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ దాతల సహకారంతో నూతన భవన నిర్మాణం మొదలైందన్నారు. నిర్మాణాన్ని పూర్తిచేసి 2027-28 విద్యా సంవత్సరానికి నూతన భవనంలో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు ఘంటా పున్నారావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, వడ్లమూడి నాగేంద్ర. గుంటుపల్లి కోటేశ్వర రావు, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

టూరిస్ట్‌లకు రక్షణ కల్పించలేకపోయారు : జేడీ శీలం

బాపట్ల, మే 14 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో టూరిస్ట్‌లకు రక్షణ కల్పించలేకపోయారని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం విమర్శించారు. జిల్లా కేంద్రమైన బాపట్లలోని పటేల్‌నగర్‌లో బుధవారం పార్టీశ్రేణులు ఏర్పాటు చేసిన సమావేశంలో జేడీ శీలం మాట్లాడుతూ ఉగ్రవాదులు ఉన్నారన్న సంకేతాలు ఉన్నప్పటికి రక్షణ కల్పించకపోవటం దారుణమన్నారు. రక్షణ ఉందని పాలకులు చెప్పటం వల్లే విహారయాత్రకు వెళ్ళి టూరిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారికి రక్షణ కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అమెరికా అధినేత ట్రంప్ దగ్గర ఎందుకు సాగిలపడ్డారో చెప్పాలన్నారు. యుద్ధం ఆపే విషయంలో అంతా తానే చేశానని ట్రంప్ ఎందుకు చెబుతున్నాడన్నారు. దీనిపై ఆల్ పార్టీల మీటింగ్ పెట్టి చర్చించాలన్నారు. ప్రజాస్వామ్యం అంటే బీజేపీ ఒక్కటే కాదని, అన్ని పార్టీలతో పార్లమెంట్‌లో చర్చించాలన్నారు.

రైతులకు ఉచితంగా 4.5 లక్షల మొక్కల పంపిణీ

చిలకలూరిపేట, మే14 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక అభివృద్ధి, ఉద్యానవన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకొని స్థానిక అసిస్ట్ సేవా సంస్థ, వ్యవసాయ ఆధారిత టెక్నాలజీ సంస్థ వరాహ మధ్య బుధవారం అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాన్ని అసిస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ జాస్తి రంగారావు, వరాహ భాగస్వామ్యాల మేనేజరు ఎంఎస్ఎన్ మూర్తి పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం వచ్చే సీజన్‌లో రూ. 5.24 కోట్ల విలువ కలిగిన నాలుగున్నర లక్షల మామిడి, జీడి, కొబ్బరి, నిమ్మ, ఎర్రచందనం, టేకు మొక్కలను ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సుమారు పది జిల్లాల్లోని రైతులకు ఉచితంగా పంచనున్నారు. ఈ మొక్కలను అసిస్ట్ సంస్థ సిద్ధ చేస్తుంది. దీంతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయ వనరులు అందుబాటులోకి రావడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు వీలవుతుంది. ఈ సందర్భంగా జాస్తి రంగారావు మాట్లాడుతూ అసిస్ట్ స్థాపన నుంచే గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోంది. వరాహ సంస్థ మేనేజరు ఎంఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పంటల శాస్త్రీయ విశ్లేషణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ

గుంటూరు (విద్య) మే 14 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (కొత్తపేట) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బ్యూటీషియన్, రిఫ్రిజిరేషన్ ఏసీ సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ డీ సందీప్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్ కోర్సుకు 19 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మహిళలు అర్హులని, 30 రోజులపాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కోర్సు జూన్ 12వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు వివరించారు. అదేవిధంగా ఏసీ రిఫ్రిజిరేషన్ ఏసీ సర్వీసింగ్ 19 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు ఉన్న యువకులు అరు లని, శిక్షణ 30 రోజులు ఉంటుందని తెలిపారు. ఈ కోర్సు జూన్ 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాల కోసం కొత్తపేట, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంకు రోడ్, (0863-2336912,9700687696) లో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్య శాఖ మెరిట్ జాబితా విడుదల

● అభ్యంతరాలకు 20 వరకు గడువు

గుంటూరు మెడికల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ కోసం ఎంపిక చేసిన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రొవిజనల్ మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉన్నవారు మే 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు లిఖితపూర్వకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు. ఆ తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోమని ఆమె స్పష్టం చేశారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



షేక్ పర్వీన్ (ఫైల్)

యడ్లపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు మహిళ మృతిచెందిన సంఘటన యడ్లపాడు మండలం కారుచేల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ పర్వీన్(34) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజులాగే బుధవారం మరో ఆరుగురితో కలసి మిరప కాయలు కోసేందుకు పొలానికి వెళ్ళింది. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గట్టువైపు పరుగులు పెట్టారు. ఆ సమయంలో అందరికన్నా వెనుకగా పొలంలో ఉన్న పర్వీన్ సమీపంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పిడుగు పాటుకు రెండు చెవుల నుంచి రక్తం రావడంతోపాటు శరీర భాగాలపై పలు చోట్ల చర్మం కాలిపోయి గాయాలయ్యాయి. పిడుగు పడిన ప్రాంతంలో మిరప చెట్లు వేర్లతో పైకి లేచి పడడంతోపాటు నాలుగు మీటర్ల పరిధిలో చెట్లు వడలి పోయాయి. సహచర కూలీల సహాయంతో మృతురాలి భౌతికకాయాన్ని గ్రామంలోని నివాసానికి చేర్చారు. పర్వీన్‌కు భర్త సైదా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు పిడుగు పడిన ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00





గుంటూరు సిటీ వార్తలు



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయాల వారీగా అంతర్గత డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, డ్రైన్లలో చెత్త వేసే వారికి అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం కమిష నర్ పాత గుంటూరు, కొత్తపేట, సీతానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ నాగభూషణం, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణా ళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశుభ్రంగా ఉంచాలి

అన్నక్యాంటీన్లల్లో ఆహారం కోసం వచ్చే వారి సంఖ్య రోజు రోజుకి పెరుగు తుందని, క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉండేలా అక్షయపాత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ బుధవారం బస్టాండ్ దగ్గర లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు. క్యాంటీన్లలో ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ప్రభుత్వాన్ని పక్కదారి పట్టిస్తున్న అధికారులు

● అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జీ వనజ

గుంటూరు సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వో) విషయంలో ప్రభుత్వాన్ని కొందరు అధికారులు తప్పు దారి పట్టిస్తున్నారని అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జీ.వనజ ఆరోపించారు. గుంటూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట 17 రోజులుగా తాము నిరసన కార్యక్రమాలు చేప డుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. 23 శాతం వేతన సవరణ డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు. మూడు సంవత్సరాల నుంచి రూపాయి కూడా పెంచలేదని, గత నెల జీతాలు కూడా వేయలేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ సంధ్య, జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, జిల్లా నాయకులు అబ్బుస్, షరీఫ్, రవితేజ, జయంతి, డీ ప్రవళిక, హర్ష జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదురు ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

నేడు ఎస్టీయూ కార్యవర్గ సమావేశం

గుంటూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ గుంటూరు జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో గురువారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు డీ పెద బాబు, డీకే సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు సీహెచ్ ప్రకాశరావు బదిలీ చట్టం, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, రేషనలైజేషన్, ప్రమోషన్స్, బదిలీ ఉత్తర్వులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సనాతన ధర్మం, ఆధ్యాత్మిక చింతనపై అవగాహన కల్పించాలి


● హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరుడు విద్యారణ్య భారతీ

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు మన సనాతన ధర్మ, ఆధ్యాత్మిక చింతన, దేవాలయాల విశిష్టతల గురించి అవగాహన కల్పించాలని శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరుడు విద్యారణ్య భారతీ సూచించారు. బుధవారం అరండల్‌పేటల 4/4వ లైనులోని శివాలయంలో శ్రీ శరవణభవ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ శిఖర, కలశ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్ర మాన్ని విద్యారణ్య భారతీ తన చేతుల మీదగా జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ, గోపుర శిఖర, కలశ ప్రతిష్ఠలు అనేవి మాన జీవితానికి సిగ్నల్స్ వంటివన్నారు. ఈ సంకేతాల ద్వారా బయట ప్రజానీకానికి జీవన విధానంలో సమతుల్యం ఏర్పాటు చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అయ్యప్ప సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ దంపతుల చేతుల మీదగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాదు, కుందుర్తి సుబ్రహ్మణ్య శర్మ, భాస్కర శర్మ, మర్రిపాటి ప్రసాద్ శర్మ, దారపనేని శివ పాల్గొన్నారు.



అరండల్‌పేట శివాలయంలో జరిగిన ఆలయ శిఖర, కలశ ప్రతిష్ఠలో పాల్గొన్న విద్యారణ్య భారతీ

మాతృదేవోభవపై ప్రవచనం



ప్రవచనం చేస్తున్న కేవీ కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం అన్నమయ్య కళావేదికగా మంగళవారం సుం దర సత్సంగ్ సభ్యులు కేవీ కోటేశ్వరరావుతో జగద్గురువు శ్రీశంకరాచార్యుల వారు రచించిన మాతృదేవోభవ అనే అంశంపై జరుగుతున్న ప్రవచనం బుధవారం కొనసాగింది. శ్రీ రాముడు మాతాపితల పట్ల ఎంత భక్తి కలిగి ఉన్నాడనేది రామాయణం తెలియ జేస్తుందన్నారు. దేహాలు అశాశ్వతాలు, సంపదలు అనిత్యాలు, మృత్యువు ఎప్పుడు కాచుకొని ఉంటుందని, అన్ని వేళల ధర్మ మార్గాన్ని అను సరించాలన్నారు. ఈ ధర్మ మార్గం సనాతనం అని, అదే శాశ్వతమని మాతృపంచకంలోని పరమార్థం అన్నారు. ఇటువంటి ధార్మిక ప్రసంగాలు వినడం ద్వారా ప్రజల్లో చక్కటి మార్పు కలుగుతుందని ఆయన తెలియజేశారు.

17న వన్డే జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, పిచు కల మైదానంలో అండర్-19 బాలుర విభాగంలో ఈ నెల 17వ తేదీన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన్డే జట్ల ఎంపికలు జరుగుతాయని త్రీ కమిటీ సభ్యుడు మహతి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2006 సంవత్స రంలో పుట్టిన వారు ఈ ఎంపికలను అర్హులన్నారు. వైట్‌డ్రస్, కిట్‌లతో ఎంపికలకు హాజరవ్వాలని పేర్కొన్నారు.

'తూర్పు'లో యువత భవితకు భరోసా

● ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా

● 701 మందికి నియామక పత్రాలు జారీ

గుంటూరు, మే 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చేపట్టిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది. నియోజకవర్గంలోని జలగం రామారావు హైస్కూ ల్లో బుధవారం చేపట్టిన జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 2వేల మందికి పైగా నిరుద్యోగులు హాజరైన ఈ జాబ్ మేళాలో 701 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వెంటనే ఎమ్మెల్యే నసీర్ నియామక పత్రాలు అందజేశారు. జాబ్‌మేళా కార్య క్రమాన్ని ఎమ్మెల్యే నసీర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజక వర్గంలో ప్రతి విద్యార్థి జీవితానికి తాను భరోసాగా నిలుస్తానని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి నాలు గు నెలలకు ఒకసారి ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు తమ డిగ్రీలతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శ్రద్ధ పెట్టాలని సూచించారు.



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ సమత, భార్గవ్, జాగర్లమూడి శ్రీనివాస్, మహమ్మద్ హఫీజ్, శనక్కాయల రాజకుమారి, గుడిపల్లి వాణి, కొనకళ్ల సత్యం, కోటా పిచ్చిరెడ్డి, ఫిరోజ్, కొంగర ఏడుకొండలు, బాజీ మాస్టర్, ఆనంద్ సాగర్, పోతురాజు చంద్ర తదితరులు పాల్గొన్నారు.



సుభానికి ఆర్థికసాయం అందజేస్తున్న డీఎస్ఆర్ మిత్ర మండలి సభ్యులు

క్రీడాకారుడికి ఆర్థికసాయం

గుంటూరు(తూర్పు), మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి 100 కిలోమీటర్ల మారథాన్ పోటీలో పాల్గొనేందుకు వెళ్తున్న నగరానికి చెందిన పేద క్రీడాకారుడు షేక్ సుభానికి డీఎస్ఆర్ మిత్రమండలి సభ్యులు అండగా నిలబడ్డారు. ప్రయాణ, ఇతర ఖర్చుల కోసం రూ.15వేల సాయం అందించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం దామచర్ల శ్రీనివాసరావు చేతుల మీదగా ఈ సాయాన్ని అందజేశారు. పోటీల్లో ప్రథమ స్థానం నిలిచి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు మద్దినేని సురేష్, రవీంద్ర శ్రీను, మార్గదర్శి చీఫ్ మేనేజర్ తిలక్, శ్రీను, కోచ్‌లు రామకృష్ణ, శివ పాల్గొన్నారు.

నేడు లాంచెస్టర్ రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, మే 14(ఆంధ్రజ్యోతి): నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటు చేయటంలో భాగంగా సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డులో గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ

గుంటూరు(తూర్పు), మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలలు గా పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో చార్జీలు అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీ చదివే విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యశ్వంత్, డేవిడ్, ప్రణీత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బందెల నాసర్‌జీ, పాల్గొన్న సంఘ నాయకులు

సీబీఎస్ఈ ఫలితాల్లో కేవీ విద్యార్థుల ప్రతిభ

● నూరుశాతం ఉత్తీర్ణత నమోదు

గుంటూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ స్కూల్ ఎడ్యు కేషన్ (సీబీఎస్ఈ) విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు మూడు శాతం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. తమ విద్యార్థులు షిఫ్ట్ వన్ (ఉదయం)విభాగంలో 10వ తరగతి పరీక్షలకు 91 మంది పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా 12వ తరగతి పరీక్షకు 35 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. షిఫ్ట్ టూ లో (సాయంత్రం) 49 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. పదిలో 500 మార్కులకు గాను చలువాది లక్ష్మీ తేజస్విని 480, నాగళ్ళ ఉదయ్‌చౌదరి 452, డీ వర్షిత్ 440 సాధించారు. 12వ తరగతిలో ఈ ధనుష్ నారాయణ 95.2శాతం, చేబ్రోలు మోహిత్ 90 శాతం, షేక్ అమీన్ మహబూబ్ 82 శాతం మార్కులు సాధించారు. షిఫ్ట్ టూలో (సాయంత్రం)షేక్ మొహమ్మద్ 478, పోతురాజు జయవర్ధన్ 445, గుజ్జర్ సాయి తేజ 428 మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, హెచ్ఎం అభినందించారు.

క్యారమ్స్ క్రీడాకారుడికి అభినందనలు

గుంటూరు(తూర్పు), మే 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో వైజాగ్, శివ శివాని స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర మొదటి ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్- 2025లో జిల్లాకు చెందిన బీ రవీంద్రరెడ్డి అత్యున్నత ప్రతిభ చూపి రాష్ట్ర ఛాంపియన్ టైటిల్‌ను గెలిచి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా బి.రవీంద్రరెడ్డిని ఆంధ్ర ప్రదేశ్ క్యారమ్స్ సంఘం, చీఫ్ పాట్రన్ యాగంటి దుర్గారావు, అధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జలీల్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు పీ.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



రవీంద్రరెడ్డికి సర్టిఫికెట్, ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

కమిషనర్ సంతకం ఫోర్జరీపై క్రిమినల్ కేసు

● తనను రెగ్యులర్ చేయాలంటూ హైకోర్టులో రిట్ పిటిషన్

● ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై లాలాపేట పోలీస్‌స్టేషన్లో బుధవారం క్రిమినల్ కేసు నమోదైంది. కమిషనర్ ఫిర్యాదు మేరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి డేరంగుల దుర్గారావుపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఏవీ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో డేరంగుల దు ర్గారావు 1998 నుంచి ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగం చేస్తున్నారు. అయితే ఇటీవల ఆయన తనను రెగ్యులర్ చేయాలంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే అందులో తాను కాంట్రాక్టు ఉద్యోగినని పేర్కొన్నారు. ఇందుకు గాను కమిషనర్ జారీ చేసినట్లుగా నకిలీ గుర్తింపు కార్డు(ఐడీ) సృష్టించారు. అందులో కమిషనర్ పులి శ్రీని వాసులు సంతకం ఫోర్జరీ చేశారు. అయితే కార్పొరేషన్‌లో రెగ్యులర్ ఉద్యోగులకు జారీ చేసే ఐడీ కార్డు తరహాలోనే ఐడీ నెంబర్ రాసి నకిలీ ఐడీ కార్డు సృష్టించారు. దుర్గారావు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు నకిలీ ఐడీని కూడా జత చేశాడు. కాగా దీనిపై స్పందిం చిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలంటూ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించింది. దీంతో దుర్గారావు హైకోర్టులో సమర్పించిన పిటిషన్లోని వివరాలను పరిశీలించిన అధికారులు దుర్గారావు నకిలీ ఐడీ సృష్టించినట్లు గుర్తించి ఖంగుతిన్నారు. ఏకంగా హైకోర్టునే బురిడీ కొట్టించే ప్రయత్నం చేయడంతో అధికారులు విస్మయానికి గురయ్యారు. దీనిపై కమిషనర్ పులి శ్రీనివాసులు లాలాపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు దుర్గారావుపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాణావత్ రామాంజి (46)అనే ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామాంజి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అందుకు అవసరమైన డబ్బులు కోసం అప్పులు చేశాడు. ఒకవైపు అప్పులు, మరోవైపు మద్యానికి బానిస కావడంతో వారం రోజుల క్రితం ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు కిందకి దించి వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం రామాంజి మృతి చెందాడు. ఆయన భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతి స్థిమితం లేని యువకుడి మృతి

● మృతుడు హైదరాబాద్ వాసిగా గుర్తింపు

స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీఎస్ నగర్‌లో నీరు లేని బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడి జేబులో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మృతు డిని హైదరాబాదులోని చాంద్రాయణగుట్ట పరిధిలో గల బండ్లగూడకు చెందిన హిదా యత్ అలీ (27)గా గుర్తించారు. మూడు రోజుల క్రితం బావిలో పడి ఉంటాడని పోలీసు లు అనుమానిస్తున్నారు. బావి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. లాలాపేట పోలీసులు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. కొద్దిరోజులుగా మతిస్థిమితం లేక స్థానికంగా తిరుగుతు న్నట్లు స్థానికులు తెలిపారు. ఆధార్‌కార్డులో ఉన్న ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు గుంటూరు బయలుదేరారు. అలీకి మతిస్థిమితంగా ఉండదని, రెండు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు మృతుడి తండ్రి అహ్మద్ హుస్సేన్ తెలి పారు. ఈ మేరకు లాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

గుంటూరు(తూర్పు), మే 14(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిబిరాల్లో పాల్గొనే విద్యార్థులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ చేతుల మీదగా క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శిబిరాలకు అధిక సంఖ్యలో విద్యా ర్థులు హాజరయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. డీఎస్‌డీవో నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31 వరకు జరిగే శిబిరాలకు హాజరై విద్యార్థులకు క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సామగ్రి పంపిణీ జరుగుతుందని చెప్పారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జ్‌లు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవతేజ

అత్తింటి ముందు కోడలు మౌన పోరాటం

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నవభారత్‌నగర్‌లో ఓ వివాహిత అత్తింటి ఎదుట మౌన పోరాటం చేస్తోంది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో భార్యను అత్తింటి వారు ఇంట్లోకి రానివ్వడం లేదు. దీంతో ఆ వివాహిత బుధవారం మధ్యాహ్నం నుంచి అత్తింటి ముందే బైఠాయించి నిరసనకు దిగింది. స్థానికులు బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

అనకాపల్లికి చెందిన మహిళ నగరంలోని ఐటీసీ హోటల్ వెనుక ఉన్న నవభారత్ నగర్‌కి చెందిన వ్యక్తితో మూడున్నర సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భర్త గతంలో హైదరాబాదులో రెస్టారెంట్ నిర్వహించాడు. ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నారు. కొద్దిరోజులుగా వారి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. దీంతో భర్త, అత్తమామలు ఆమెను ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో ఆమె అత్తింటి ముందు బైఠాయించి నిరసన తెలియజేస్తోంది. అయితే దీనిపై పోలీసులకు సమాచారం అందలేదని తెలిసింది.

సమ్మెకు సహకరించాలి

గుంటూరు(తూర్పు), మే 14(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొంటారని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్న వెంకాయమ్మ, టీ రాధా స్పష్టం చేశారు. ఈ మేరకు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ డీఈవో హరికి సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు, మినీ సెంటర్స్‌ను మెయిన్ సెం టర్స్‌గా ఇతర డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ ఈ సమ్మెలో పాల్గొం టున్నామని పేర్కొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తితో లక్ష్యాలు సాధించాలి

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మే 14(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించి దేశ ఔన్నత్యానికి పాటుపడాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక అరండల్‌పేట 5/1లో ది జెనిత్ స్పోర్ట్స్ షోరూమ్‌ను బుధవారం ఎస్పీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. క్రీడాకారులు టోర్నమెంట్‌ల ద్వారా క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. మానసికోల్లాసంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. షోరూమ్ ఎండీ తోట సురేష్ మాట్లాడుతూ 8 ఏళ్లుగా అంత ర్జాతీయ స్థాయిలో ఉపయోగించే స్పోర్ట్స్ బ్రాండ్స్‌ను తాము భారత దేశం నలుమూలలా విక్రయిస్తున్నామని తెలిపారు. క్రీడా అభిమాను లకు ఈ షోరూమ్ సంతృప్తిని ఇస్తుందని, అన్ని క్రీడలకు సంబంధించిన పరికరాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), సామాజిక, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ బ్యాట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషాలిటీ వైద్యసేవలు

● డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ వెల్లడి

గుంటూరు మెడికల్, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బొంగరాల బీడు, శారదా కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషాలిటీ డాక్టర్ల సేవలను అందుబాటులోకి తెచ్చి ప్రజలకు మెరుగైన వైద్యసే వలు స్థానికంగానే అందిస్తామని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధి సంఘం సభ్యుడు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ వెల్లడించారు. బుధవారం శారదాకాలనీ, బొంగరాలబీడు యూపీహెచ్‌సీలను ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వితో కలసి ఆయన సందర్శించారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రాలను వారు తనిఖీ చేశారు. ఈ కేంద్రాల్లో సీసీ టీవీలకు వరమ్మతులు చేయించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ గుంటూరు జీజీహెచ్ నుంచి స్పెషాలిటీ డాక్టర్ల ను నిర్దేశిత రోజుల్లో ఈ రెండు ఆరోగ్య కేంద్రాలకు కేటాయించి స్థానిక ప్రజలకు సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.



ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ఉమాశంకర్, రమణ యశస్వి

బంగారం తూకంలో జాగ్రత్తలు పాటించాలి

● జాయింట్ కంట్రోలర్ ఎన్ఎస్ మాధురి

గుంటూరు(తూర్పు), మే 14 (ఆంధ్రజ్యోతి): బంగారం తూకంలో వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎన్ఎస్ మాధురి అన్నారు. మెట్రాలజీ డే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పట్నం బజారు, బులియన్ జూవెలరీ అండ్ పాన్ బ్రోకర్ మర్చంట్ అసోసియేషన్ హాల్లో వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లావాదేవీల్లో మిల్లిగ్రాము ఖచ్చితత్వం ఉన్న ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాన్ని వినియోగించుకోవాలన్నారు. రశీదులో బంగారం, రాళ్ల పరిమాణాల్ని వేరు, వేరుగా చూపించాలన్నారు. తూకం యంత్రాన్ని ప్రతి ఏడాది ధృవీకరించి, సర్టిఫికెట్ పొందాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కంట్రోలర్ షాలమ్ రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ జి కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజా, అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ జైన్, ప్రధాన కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ మాధురి

విద్యార్థులకు ఉర్దూ భాషపై శిక్షణ

గుంటూరు (విద్య) మే 14 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ భాషాభివృద్ధికి ప్రభు త్వం కృషి చేస్తుందని వేసవి సెలవుల్లో విద్యార్థులు ఉర్దూ భాష నేర్చు కోవడానికి వీలుగా ఉర్దూ అకాడమీ ఆంధ్రప్రదేశ్ వారి తరఫున 'చలో ఉర్దూ లైబ్రరీ' కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉర్దూ డీఐ ఎస్‌కే ఎండీ ఖాసీం వెల్లడించారు. బుధవారం స్థానిక చౌత్ర సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి చలో ఉర్దూ లైబ్రరీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉర్దూ డీఐ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగించుకోవడానికి వీలుగా ఏర్పాటు చేసి న ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకారి అని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఉర్దూ అకాడమీ లైబ్రరీ సిబ్బంది షేక్ అక్బర్ రఫీ ఫక్రుద్దీన్ అబ్దుల్లా మహిమున్నీసా మల్లికా నాగూర్ బాషా, జిలాని, ఉర్దూ భాషాభిమానులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న ఉర్దూ ఉపాధ్యాయులు

విశ్రాంత డీఎస్పీ బొప్పన మృతికి సంతాపం

గుంటూరు, మే 14(ఆంధ్రజ్యోతి): విశ్రాంత డీఎస్పీ బొప్పన విజయ కుమార్ (75) అనారోగ్యంతో మంగళగిరిలో బుధవారం మృతి చెందాడు. ఆయన 1976లో ఎస్ఐగా పోలీసు విభాగంలో చేరారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన ఆయన సాంస్కృతిక రంగంలో కళాకారులను ప్రోత్సహించారు. సాంస్కృతిక బృందాలను ఏర్పాటు చేసి అమరావతి ఉద్యమానికి అండగా నిలిచారు. బొప్పన మృతికి విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సంతాపం తెలియజేసినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ తెలిపారు. అలానే బొప్పన మృతికి విశ్రాంత డీజీపీ డాక్టర్ ఎం మాలకొండయ్య, సంఘం గౌర వాధ్యక్షుడు, విశ్రాంత ఐజీలు డాక్టర్ సీఆర్ నాయుడు, ఉపాధ్యక్షుడు ఏ రవిచంద్ర, కోశాధికారి కేవీ నారాయణ, విశ్రాంత ఎస్పీ రంగప్రసాద్, విశ్రాంత డీఎస్పీ బీవీ సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముసునూరు రవి, సంయుక్త కార్యదర్శి సీహెచ్ చక్రపాణి సంతాపం తెలిపారు.

వినోదాన్ని పంచుతున్న సింగిల్

● హీరో శ్రీ విష్ణు



గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ చిత్ర హీరో శ్రీ విష్ణు

నరసరావుపేట కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి). ఇటీవల విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న సింగిల్ చిత్రం హీరో శ్రీ విష్ణు, హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానాలు బుధవారం ఆ సినిమా ప్రదర్శిత మౌతున్న కాసు సెంట్రల్‌లోని గీతా మల్టీప్లెక్స్‌కు విచ్చేశారు. హీరో, హీరోయిన్ల రాక గురించి తెలుసుకున్న అభిమానులు భారీగా తరలివచ్చారు. థియేటర్ యాజమాన్యం వారికి ఘనంగా స్వాగతం పలికారు. తొలుత మాల్‌లో ఏర్పాటు చేసిన వేదికపైన అభిమానుల నడుమ సందడి చేసారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు హీరో అభివాదం చేసారు. అనంతరం సినిమా ప్రదర్శితమౌతున్న స్క్రీన్‌కు విచ్చేసి థియేటర్‌లోని ప్రేక్షకులకు అభివాదం చేసారు. సింగిల్ సినిమాని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే హీరోయిన్ కేతిక శర్మ ప్రేక్షకులకు అభివాదం చేసారు. హీరో, హీరోయిన్ల రావడంతో కాసేపు సినిమా ప్రదర్శనను నిలిపివేశారు. ఈ సందర్భంగా అభిమానులు సందడి చేశారు. అనంతరం హీరో శ్రీ విష్ణు మీడియాతో మాట్లాడుతూ తను ఈ సినిమా కథ వింటున్నప్పుడు బాగా ఎంజాయ్ చేశానని, ఇప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తుంటే ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమాలో ఫన్ క్రియేట్ చేయడం కోసం డిఫరెంట్ మాడ్యులేషన్ ట్రై చేసానన్నారు. గీతా వంటి పెద్ద బేన ర్‌లో పనిచేయడం గర్వం గా ఉందన్నారు. ఇదే జోనర్‌లో మరిన్ని సినిమాలు చేస్తానన్నారు.

గుంటూరులో..

గుంటూరు(తూర్పు), మే 14(ఆంధ్రజ్యోతి): సింగిల్ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుందని హీరో శ్రీ విష్ణు ఆనందాన్ని వ్యక్తం చేశారు. విజయయాత్రలో భాగంగా బుధవారం నగరంపాలెం ఫినిక్స్ మాల్‌లో సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు చేసిన సినిమాల్లో సింగిల్ మరింత సంతృప్తి నిచ్చిందని అన్నారు. భవిష్యత్తులో మంచి పాత్రలను ఎంపికచేసుకుని ప్రేక్షకులను మెప్పిస్తానని చెప్పారు. దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా మాట్లాడుతూ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు, శ్రీ విష్ణు అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫినిక్స్ మాల్ యాజమాన్యం, పంపిణీ దారులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల వరివంగడాలకు బహు డిమాండ్

ఫౌండేషన్ సీడ్ విక్రయాలకు ఏర్పాట్లు

మూడు రాష్ట్రాలు నుంచి రైతుల ఆర్డర్



బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం కార్యాలయం

బీపీటీ.. ఘనాపాటి

బాపట్ల, మే14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వరివంగడాలకు బహుడిమాండ్ ఉంది. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం నందు ఎంపిక చేసిన పంటలను పండించి ఫౌండేషన్ సీడ్ తీసి ప్రతి ఏడాది రైతులకు విక్రయిస్తూ ఉంటారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్ లో రైతులకు అందించేందుకు నాలుగు రకాల విత్తనాలను ఎంపికచేసి పండించి ఫౌండేషన్ సీడ్ సిద్ధం చేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీవారు వీటిని ధ్రువీకరించారు. నాణ్యతకు సంబంధించిన ట్యాగ్‌లు వచ్చిన వెంటనే విత్తనాలు విక్రయించనున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన బీపీటీ 5204 (సాంబ మసూరి) విత్తనాల కోసం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 300మంది రైతులు పోస్ట్‌కార్డుల ద్వారా 3వేల బ్యాగ్‌లు కావాలని కోరారు. అదేవిధంగా బీపీటీ 2270 (బావపురి సన్నాలు) విత్తనాలు 3వేల బ్యాగ్‌లు కావాలని రైతులు పోస్ట్‌కార్డులు పంపించారు. అలాగే బీపీటీ 2782 (భవతి), బీపీటీ 2595 (తేజ) రకాల విత్తనాలు కూడా కావాలని పోస్ట్‌కార్డులు పంపించారు. ప్రస్తుతం వ్యవసాయ క్షేత్రంవారు ఈ నాలుగు రకాల విత్తనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కొక్క బ్యాగ్ 30కిలోలు ఉంటుంది. కిలోఫౌండేషన్ విత్తనాల ఖరీదు 47 రూపాయల వరకు ఉంటుంది. విత్తనాల కోసం రైతులు పోటీపడటం పరిపాటి కాగా ముందుగా లేఖలు పంపిన వారికే ప్రాధాన్యం ప్రకారం విత్తనాలు ఇవ్వటం జరుగుతుంది.


ట్యాగ్‌లు వచ్చిన వెంటనే విక్రయాలు ప్రారంభిస్తాం : వ్యవసాయ క్షేత్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అరుణ



బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలో నాలుగు రకాల వరిపంటలను సాగు చేయటం జరిగింది. అందులో బిపిటి 5204, బిపిటి 2270, బిపిటి 2782, బిపిటి 2595 ఉన్నాయి. మొత్తం 1560క్వింటాళ్ళ ఫౌండేషన్ సీడ్ సిద్దంగా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీవారు నాణ్యతను పరిశీలించి ఒకే చేశారు. ట్యాగ్‌లు రాగానే 30కిలోల బ్యాగ్‌లను విక్రయించటం జరుగుతుంది. జనవరి నుండి అనేక ప్రాంతాల రైతులు విత్తనాల కోసం లేఖలు పంపించారు. ప్రాధాన్యత ప్రకారం విత్తనాలు ఇవ్వటం జరుగుతుంది. ముందుగా పోస్ట్‌కార్డులు పంపించిన వారికి ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుంది.



ప్రాచుర్యం పొందిన బీపీటీ-2270, 5204 వరిపైరు



108కి.. సుస్తీ...

(5వ పేజీ తరువాయి)

కూయలేకపోతున్నాయి. లైట్లు వెలగనంటున్నాయి. ఇంతవరకు పనిచేయకున్నా, కనీసం రోగిని సకాలంలో ఆసుపత్రికైనా తీసుకెళతాయా! అంటే అదీ నమ్మకంలేదంటున్నాయి... ప్రస్తుతం ఉన్న పాత 108 వాహనాల తీరు. ఈ మధ్య కాలంలో చాలాచోట్ల ఈ వాహనాలు మొరాయిస్తూ కనిపిస్తూనే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి మండలానికి ఒక 108 వాహనం ఏర్పాటు చేశారు. కొన్నిటికి మండల కేంద్రాల్లో నిలిపే వసతి, సిబ్బంది వేచిఉండేందుకు ఏర్పాట్లు లేక చాలాచోట్ల నియోజకవర్గ కేంద్రాల్లో ఉండిపోతున్నాయి. గుంటూరు జిల్లాలో 18 మండలాలకుగాను 18 మండలాలకు 18 వాహనాలు, బాపట్ల జిల్లాలో 25, పల్నాడు జిల్లాలో 28 మండలాలకు 28 వాహనాలు కలిపితే, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 71 వాహనాలున్నాయి. అయితే వీటిలో చాలావరకు 2 నుంచి 2.5 లక్షల కిలోమీటర్లు ఇప్పటికే తిరిగేసినవి ఉంటే, మరికొన్ని అంతకు మించి తిరిగినవీ ఉన్నాయి. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటుచెయ్యాల్సిఉన్నా, గత ప్రభుత్వం భారీగా మార్పులు చేస్తున్నామంటూ 2020లో 146 వాహనాలను, తర్వాత మరికొన్నిటిని రాష్ట్రంలో కొనుగోలు చేసింది. అయితే వీటిలో మన జిల్లాకు పెద్దగా దక్కినవి లేవు. పైగా పాతవాటికి పెద్దగా మరమ్మతులు చేయించిందీ లేదు.

కొత్తగా... అదనంగా అవసరం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 71 మండలాలుంటే, వాటికి ఒక్కొక్క మండలానికి ఒక 108 వాహనం ఉంది. అయితే వీటిలో 40 శాతం వాహనాలు సాధ్యమైనంత త్వరగా మార్చి కొత్తవాటిని ఏర్పాటుచెయ్యాల్సిఉంటే, మరికొన్నిటిని పూర్తిస్థాయి మరమ్మతులు చేయించాల్సిఉన్నాయి. కొన్నిటికైతే టైర్లు అరిగిపోయి, పంక్చర్‌లు పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటే, మరికొన్ని 104 వాహనాలదీ అదే పరిస్థితి. టైర్లు పాడయిపోయి, కొత్తవాటికోసం ఎదురు చూస్తున్నాయి. ఇదిట్లాఉంటే... రాజధాని ప్రాంతం కావటం, అవసరాలు పెరగటం, జాతీయ రహదారులపై ప్రమాదాల సంఖ్య పెరిగిపోతుండటంతో అదనపు వాహనాల అవసరం కూడా ఉంది. గుంటూరు నగరంలో ఈస్ట్, వెస్ట్ మండలాలకు రెండే ఉన్నాయి. నగరం పెద్దదే అయినా మరో రెండు వాహనాల అవసరం ఉన్నా, ఈ రెండిటితోనే చాలాకాలంగా నెట్టుకొస్తున్నారు. కొత్త జిల్లాలు ఏర్పడ్డాక పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో, బాపట్లలో ఒక్కొక్క వాహనం సరిపోకపోగా, అవీ పాతవి కావటంతో తిప్పలు తప్పటంలేదు. వీటికి అత్యవసర మెరుగైన వైద్యసేవలు అవసరమైతే గుంటూరు సమగ్ర వైద్యశాలకు రావలసిందే. ఈ నేపద్యంలో ఆయా కొత్త జిల్లా కేంద్రాల్లోనే అదనపు వాహనాలు తప్పనిసరి. ఇవికాక బాపట్ల జిల్లా, ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లో గ్రామాలు, దూరంగా ఉండటం, రవాణా సదుపాయాలు సరిగాలేకపోవటం, మెరుగైన వైద్యం కావాలంటే ఒంగోలుకే వెళ్లాల్సిరావటంతో దూరం పెరిగిపోయి, ఇబ్బందులు పడుతున్నవారూ ఉన్నారు.

190 కొత్త వాహనాలొస్తున్నాయ్... ఏజన్సీకూడా మారుతుంది

సత్యన్నారాయణ, 108 సర్వీసుల రాష్ట్ర పర్యవేక్షకుడు

పాతబడిపోయి, రిపేర్లకు గురవుతున్న వాహనాలను ఇప్పటికే గుర్తించాం. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు 190 కొత్తవాటిని కొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. త్వరలో అవికూడా సమకూరతాయి. ఏజన్సీ కూడా మారబోతోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కూడా పూర్తయింది. మరో వారంలో కొత్త ఏజన్సీ బాధ్యతలు తీసుకుంటుంది. ప్రభుత్వం వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పూర్తి ప్రక్షాళన చేయదలచుకుంది. త్వరలో అన్నీ అందుబాటులోకి వచ్చేస్తాయి. పాతవి ఉన్నా, ఏ ఇతర ఇబ్బందులు ఉన్నా, రాష్ట్రంలో ఎక్కడా ఒక్క రోగికి కానీ, అత్యవసర చికిత్స అవసరమైనవారికి కానీ ఇబ్బంది రానివ్వకుండా, ప్రాణాపాయం లేకుండా కాపాడగలిగాం. భవిష్యత్‌లో మరింత మెరుగైన సేవలు అందేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

బర్లీ పొగాకు కొనుగోళ్లపై రైతుల అసంతృప్తి

● రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

● 28న సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపు



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, పాల్గొన్న రైతు సంఘం నాయకులు

గుంటూరు(తూర్పు), మే 14 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోళ్లపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం బుధవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పంట తాము కొనుగోలు చేస్తామంటూ రైతులకు సంతకం లేని బాండ్లు ఇచ్చిన కంపెనీలు తీరా ఇప్పుడు తాము కొనుగోలు చేయలేమంటూ ముఖం చాటేశాయన్నారు. పొగాకు సాగుచేసిన రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న సీఎం క్యాంపు కార్యాలయ ము ట్టడి చేపట్టాలని పిలుపు నిచ్చారు. రైతులను మోసం చేసిన కంపెనీలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గత ఏడాది 50 మిలియన్ కేజీలు పొగాకు కొనుగోలు జరిగిందని, ఈ సంవత్సరం అసలు కొనుగోళ్లు జరగకపోవడం దుర్మార్గమన్నారు.రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై కేశవరావు, వి.కృష్ణయ్య, పి.జమలయ్య, డాక్టర్ కొల్లా రాజమోహన్, లలిత తదితరులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖమంత్రి, అధికారులు గత నెల 29న కంపెనీల యజమానులు, అధికారులు, రైతు సంఘాలు, పొగాకు రైతులతో సమావేశం నిర్వహించి నల్లబర్లీ కొనాల్సిందేనని హెచ్చరించినా ఒక్క కిలో కూడా కొనుగోలు జరగ లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్ పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయించ డంలో విఫలమైందన్నారు. తొలుత పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ రైతు సంఘాల నాయకులు సమావేశమయ్యారు. పొగాకు రైతు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా రై తుల సమస్యలు, రైతు సంఘాల అభిప్రాయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్ళ తానని చైర్మన్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, కంచుమాటి అజయ్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సర్వర్.. సంకటం!



● మొరాయిస్తున్న రైస్ కార్డు సర్వర్

● మూడు రోజులుగా అదే పరిస్థితి

● వందల్లో వస్తున్న దరఖాస్తులు..

● రోజుకు ఒకటి రెండు దరఖాస్తులతో సరి

● తలలు పట్టుకుంటున్న సచివాలయ సిబ్బంది

● నిబంధనల గందరగోళంతో కార్డుదారుల్లో కలవరం

గుంటూరు, మే 14(ఆంధ్రజ్యోతి): రైస్‌కార్డుల దరఖాస్తులను సర్వర్ సమస్యలు వెంటాడుతున్నాయి. రైస్ కార్డుల దరఖాస్తుకు అవకాశం కల్పించి ఇప్పటికి పది రోజులు అవుతున్నా దరఖాస్తుల ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన 30 రోజుల గడువులో ఇప్పటికే పది రోజుల గడువు పూర్తైపోవడంతో కార్డుదారుల్లో కలవరం మొదలయింది.

గత వైసీపీ హయాంలో రైస్‌కార్డుల ప్రక్రియ అస్తవ్యస్తంగా జరగడంతో నిజమైన లబ్దిదారులు కార్డులు పొందలేకపోయారు. దీనికితోడు నిబంధనల పేరుతో ఆ ప్రభుత్వం అనేకమంది కార్డులు తొలగించింది. వారంతా ఏళ్ల తరబడి రైస్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం రైస్ కార్డుల దరఖాస్తుకు అవకాశం కల్పించడంతో వారంతా రైస్ కార్డుల కోసం క్యూ కట్టారు. దీంతో ప్రతి సచివాలయానికి రోజుకు 10 నుంచి 20 వరకూ దరఖాస్తులు వస్తున్నాయి. దరఖాస్తుల ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. సర్వర్ రాకపోవడంతో రోజుకు ఒకటి రెండు కంటే ఎక్కువ దరఖాస్తులు చేయడానికి వీలు కావడం లేదు.

గాడిన పడని వెబ్ పోర్టల్

రైస్ కార్డు దరఖాస్తులకు సంబంధించి పౌరసరఫరాల శాఖ అందుబాటులోకి తెచ్చిన సర్వర్ సమస్యలతో ముందుకు కదలడం లేదు. కార్డుల విభజన, అడ్రస్ మార్పు, మరణించినవారి పేర్ల తొలగింపు, కొత్తగా పుట్టిన చిన్నారుల పేర్ల చేర్పు, రైస్ కార్డు సెరండర్, కొత్త కార్డుల మంజూరు వంటి సదుపాయాలకు అవకాశం కల్పించారు. అయితే అవేవీ పనిచేయడం లేదు. కేవలం పేర్ల చేర్పు, కొత్త కార్డుల దరఖాస్తులు మినహా మిగిలిన ఆప్షన్లు వెబ్‌పోర్టల్లో కనిపించడం లేదని ఉద్యోగులు దరఖాస్తుదారులను తిప్పి పంపి స్తున్నారు. దరఖాస్తు ప్రక్రియ మొదలైననాటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇదిగో అదిగో అనుకుంటూనే పదిరోజులు గడిచిపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈనెల 12వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తుకు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. అది కూడా అందుబాటులోకి రాలేదు. సొంతగా దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ పోర్టల్ కూడా ఇప్పటి వరకూ అందుబాటులోకి రాలేదు.

నిబంధనల్లో గందరగోళం..

రైస్ కార్డు దరఖాస్తులకు సంబంధించి నిబంధనల్లోనూ గందరగోళం నెలకొంది. లబ్దిదారుల ఎంపికలో సిక్స్‌స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరి అని సిబ్బంది చెబుతున్నారు. కాగా సంబంధిత శాఖ అధికా రులు త్రీ స్టెప్ వెరిఫికేషన్ మాత్రమే ఉంటుందని చెబుతున్నారు. అయితే అవి కూడా వెబ్ పోర్టల్లో అందుబాటులోకి రాలేదు. దీంతో సిక్స్ స్టెప్ వెరిఫికేషన్‌కు అనుగుణంగానే దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది. కొత్తగా పెళ్లయినవారికి పెళ్లి శుభలేక, పెళ్లిఫొటో ఉంటే సరిపోతుందని చెబుతున్నారు. కాగా మ్యారేజ్ సర్టిఫికేట్ ఉంటేనే తప్ప దరఖాస్తు చేయడానికి వీలు కాకపోవడంతో సచివాలయ సిబ్బంది తిప్పిపంపుతున్నారు. దీంతో రైస్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియ ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. దరఖాస్తు ప్రక్రియపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకుంటే ఈసారి కూడా రైస్‌కార్డు ఆశావహులకు నిరాశ తప్పదు.

బర్లీ మంటలు..!

(5వ పేజీ తరువాయి)

దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్ల జరపడమే ఈ సమస్యకు పరిష్కారం అని రైతులు చెబుతున్నారు. లేదంటే మరింత మంది రైతులు బలికాక తప్పదని అంటున్నారు.

అప్పులు తీర్చలేని పరిస్థితి



12 ఎకరాలు కౌలుకు తీసుకుని బర్లీ పొగాకు సాగు చేశాను. ఎకరానికి లక్షన్నర వరకు పెట్టుబడి ఖర్చు అయింది. ఇప్పుడు చూస్తే కనీసం కొనేవాడు కనబడడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. అప్పులు తీరే మార్గం కనబడడం లేదు

-తులసి శంకర్, పర్చూరు

కంటిమీద కునుకు ఉండడం లేదు

ఓ పక్క పొగాకును అడిగే వారే కనబడడం లేదు. మరో వైపు పొంచి ఉన్న వర్షాలతో కంటిమీద కునుకు ఉండడం లేదు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. కంపెనీలు కన్నెత్తి కూడా చూడడం లేదు. చేతికి అంది వచ్చిన పంటను అమ్ముకోవడానికి నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. ప్రభుత్వమే ఆదుకోవాలి



-పీ శ్రీనివాసరావు, ఉప్పుటూరు గ్రామ రైతు

కూల్‌గా.. రూ.కోట్లు



◆ వేసవి తాపం రూ.100 కోట్లకు పైనే వ్యాపారం

◆ జోరుగా మజ్జిగ, శీతల పానీయాలు అమ్మకాలు

◆ రోజుకు కోటిన్నర బీరు తాగి మందుబాబుల ఉపశమనం



గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): వేడెక్కిన వాతావరణంలో కూల్‌గా ఉపశమనం పొందుతున్నారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ దాటేసింది. పైగా ఉక్కపోత, వడగాడ్పులతో ప్రజలు అల్లాడుతున్నారు. వేడిమితో కూడిన వాతావరణంలో నోరు పిడచ కట్టుకుపోతోంది. చల్లటి మంచినీరు తాగినా తపన తీరకపోవడంతో ఒక్కొక్కరు ఒక్కో రకం శీతలపానీయాలు సేవిస్తూ సేద తీరుతున్నారు. దీంతో అటు వేడి.. ఇటు సేద తీరేందుకు ప్రజలు ఎక్కువగా మజ్జిగ, శీతల పానీయాలతో ఉపశమనం పొందుతున్నారు. ఇక మందుబాబులైతే బీరుతో సేద తీరుతున్నారు. మండే ఎండల్లో మ జ్జిగ, శీతల పానీయాలు, బీర్ల అమ్మకాలు జోరం దుకుంటున్నాయి. ఆయా వ్యాపారాలు రూ.కోట్ల లో జరుగుతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. కొబ్బరినీళ్ల బాటిల్ రూ.100 విక్రయిస్తున్నా ప్రజలు వెనుకాడకుండా కొనుగోలు చేస్తున్నారు. చెరుకురసం లీటర్ రూ.50కు లభిస్తున్నాయి. డెయిరీలు చల్లటి మజ్జిగను ప్రజలకు అందు బాటులోకి తెచ్చాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా లో సంగం డెయిరీ ద్వారానే రోజుకు 3 లక్షల 80 వేల ప్యాకెట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. మిగతా డెయిరీల మజ్జిగ ప్యాకెట్లు మరో లక్షా 20వేల వరకు అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ లెక్కన రోజుకు చల్లటి మజ్జిగ కోసం రూ.50 లక్షలు ఖర్చు పెడుతున్నారు. ఇవి కాకుండా ఇతరత్రా శీతల పానియాలైన కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, చెరుకు రసం, కొబ్బరిబోం డాలు వంటి వాటిని సేవించటం ద్వారా ప్రజలు సేద తీరుతున్నారు. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖకు ఈ ఎండాకాలం ఎంతో కలిసి వచ్చింది. చల్లటి బీరు కోసం మందుబాబులు బారులు తీరుతు న్నారు. కొన్ని ప్రాంతాల్లో డిమాండ్‌కు తగ్గట్లుగా బీరును సరఫరా చేయలేని పరిస్థితి నెలకొన్నది. ఏప్రిల్ ఒకటి నుంచి మే 13 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 లక్షల 79వేల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. అంటే 33 లక్షల 48 వేల బీరు సీసాల అమ్మకాలతో ప్రభుత్వ ఖజానాకు రూ.62.6 కోట్లు సమకూరాయి. రోజుకు కేవలం బీరు కోసమే మందుబాబులు రూ.కోటిన్నర ఖర్చు పెడుతున్నారు.



శీతల పానియాలు తాగుతూ..



దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో సీజన్‌లోనే అత్యధికంగా 2149 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ. 10,100, గరిష్ఠధర రూ.11,500, మోడల్‌ధర రూ.11,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,100, గరిష్ఠధర రూ.11,500 మోడల్‌ధర రూ.11,000 పలికాయి.

17న విద్యుత్ అదాలత్

తుళ్లూరు(రాయపూడి), మే 14 (ఆంధ్రజ్యోతి): కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈ నెల 17న (శనివారం) విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్ఈ(సీఆర్డీఏ) పి.సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు రాయపూడి విద్యుత్‌భవన్ కాన్ఫరెన్స్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ నుంచి సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ విశ్రాంత జడ్జీ ఎన్ విక్టర్ ఇమ్మాన్యూమేల్, సాంకేతిక సభ్యుడు ఎస్ శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యుడు సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఏ సునీత పాల్గొంటారని తెలిపారు. సీఆర్డీఏ సర్కిల్ అమరావతి డివిజన్‌పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీసు నెంబరు, పూర్తి అడ్రస్, సెల్ నెంబర్లతో ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని స్థానిక డివిజన్ ఈఈ జంగం సంజీవరావు డిప్యూటీ డీడీ కేవీ కోటేశ్వరావు ఆ ప్రకటనలో కోరారు.

కాల్వలోకి పల్టీకొట్టిన పసుపులోడు లారీ

దుగ్గిరాల, మే 14(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని కొత్తలాకు సమీపంలో పసుపులోడు లారీ కాల్వలోకి పల్టీకొట్టింది. గ్రామంలోని ఓ పసుపు ఫ్యాక్టరీ నుంచి పసుపు లోడుతో బయలుదేరిన లారీ కొత్తలాకు వద్ద మెయిన్ రోడ్ ఎక్కుతుండగా అకస్మాత్తుగా గేర్‌బాక్స్ మొరాయించింది. దీంతో లారీ అదుపుతప్పి వెనుకకు వస్తూ అదుపుతప్పి పక్కనే ఉన్న కాల్వలోకి పల్టీకొట్టింది. కాల్వలో నీరులేకపోవడంతో డ్రైవర్ గాయాలతో బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన డ్రైవర్‌ను 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డు గుంతలమయమై, రెండువైపులా మార్జిన్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సెంట్రల్ వేర్‌హౌస్, మార్కెట్‌యార్డు, పసుపు ఫ్యాక్టరీలకు, నిత్యం సుమారు 20టన్నుల భారీలోడుతో లారీలు వెళ్లే తుంగభద్ర కాల్వకట్ట రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల దాహార్తిని తీర్చుతున్న అధికారులు

పెదనందిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తినే తీర్చేందుకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి సంపులో నింపి కొళాయిల ద్వారా ప్రజలు తాగునీటిని అందిస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో వెలువడిన దాహార్తిని తీర్చే దారేది.. అనే కథనంతో అధికారుల్లో స్పందించి నీటిని కొనుగోలు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు.

లోలెవల్ చప్టాకు మోక్షం



శిథిలావస్థలో ఉన్న చప్టాను ప్రొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

కాకుమాను, మే 14(ఆంధ్రజ్యోతి): కాకుమాను శివారులో బాపట్ల పెదనందిపాడు ప్రధాన రహదారిపై ఉన్న లోలెవల్ చప్టాకు మోక్షం లభించింది. ఐదేళ్ల నుంచి చప్టాపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహన చోదకుల కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. నూతన చప్టా నిర్మాణానికి అనుమతులు రావడంతో బుధవారం పాడైపోయిన చప్టాను తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. అలాగే చప్టా పక్క నుంచి ఎర్ర గ్రావెల్‌తో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారి ఏర్పాటు చేశారు. నూతన చప్టా ఏర్పాటు నిర్మాణంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయాలి

దుగ్గిరాల, మే 14(ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు, ఉద్యోగోన్నతులు, బదిలీల సమస్యలపై చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కే కామాక్షి, బీ చలపతిరావు కోరారు. ప్రతి గ్రామంలోనూ మోడల్ ప్రైమరీస్కూల్ ఏర్పాటు చేయాలని, 1నుంచి5తరగతల వరకూ ఐదుగురు టీచర్లను నియమించాలని కోరుతూ మంగళగిరిలోని రాష్ట్రవిద్యాభవన్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన ధర్నాలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

● ఫరూఖ్ షుబ్లీ

కాకుమాను, మే 14 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్ షుబ్లీ అన్నారు. లింగంగుంటపాలెంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు బాజీ కుమారుడి ఖత్నా కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఫరూఖ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు షేక్ ఖదీర్, షేక్ సుల్తాన్, మెమన్ బాషా, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు తగవు

దుగ్గిరాల, మే 14 (ఆంధ్రజ్యోతి) : దేశం గర్వంగా చెప్పుకునే కల్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు తగవని భారత లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు షేక్ సుభాని అన్నారు.

వడ్డమాను, పెదపరిమిలో అధికారుల గ్రామసభలు

● ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



పెదపరిమి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు(వడ్డమాను, పెదపరిమి) మే 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి మరో 45 వేల ఎకరాల వరకు అవసరం ఉంటుందని కూటమి ప్రభుత్వం సూత్రప్రాయంగా ప్రకటించింది. అందులో భాగంగా బుధవారం వడ్డమాను, పెదపరి మి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం హరిశ్చంద్రపురంలో ల్యాండ్ పూలింగ్ మీద గ్రామసభ నిర్వహించారు. దీనిపై వడ్డమాను గ్రామసభలో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులు ప్రభుత్వానికి అనుకూలమని గోప్యంగా హరిశ్చంద్రపురంలో గ్రామసభ ఎందుకు పెట్టారని అడిగారు. పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు సమయం తక్కువగా ఉండటంతో అందరికీ సమాచారం ఇవ్వలేకపోయామని రైతులకు అధికారులు వెల్లడించారు. ఇది ప్రాథమిక మీటింగ్ మాత్రమేనని వివరించారు. సభలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ హాజరయ్యారు. సభలో రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చంద్రబాబు మీద నమ్మకం ఉంది.. అయితే రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత లేకపోవటం వల్ల ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వ అరాచక భయాలు వెంటాడుతున్నాయని చట్టబద్ధత కల్పించాలని అభిప్రాయం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ముందు చూపుతో ఆలోచిస్తారన్నారు. ఫేస్-2లో 45 వేల ఎకరాలు అవసరం ఉందని ఆయన సూచించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు ఇబ్బందులు పాలైన మాట వాస్తవమేనన్నారు. అలా జరగకుండా ఉండటం కోసం చంద్రబాబు రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించటానికి చర్యలు తీసుకుంటున్నారని రైతులకు ఎమ్మె ల్యే తెలిపారు. సభలకు ఆర్డీవో కె.శ్రీనివాసరావు అధ్య క్షత వహించి ల్యాండు పూలింగ్ ఆవశ్యకత గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ వడ్డమాను అధ్యక్షుడు పుచ్చకాయల సాంబశివరావు, మాజీ ఎంపీటీసీ పిన్నక సాంబశివరావు, రైతు నాయకులు చుండు వెంకటరెడ్డి, పెదపరిమి గ్రామసభలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, నాయకులు నూతలపాటి రామారావు, పోతుగుంట నర్సయ్య, భాష్యం చిన శ్రీధర్, పెద శ్రీధర్, ఎమ్మెర్వో బి.సుజాత, ఎంపీడీవో శిల్పా, రెవెన్యూ సిబ్బంది. సీఐ అంజయ్య, వడ్డమాను, పెదపరిమి రైతులు, రైతు కూలీలు, పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఎన్టీఆర్ విగ్రహం

పెదనందిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడులో గ్రామ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థులు, దాతల సహకారంతో టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం 6గంటలకు విగ్రహావిష్కరణ చేయనున్నట్లు గ్రామ అధ్యక్షుడు, బండి నాగబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావులు తెలిపారు. విగ్రహాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు.

ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం

- నేలకొరిగిన చెట్లు, హోర్డింగ్‌లు
- పలు గ్రామాల్లో తెగిన విద్యుత్ వైర్లు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- వాతావరణ మార్పుతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు



గొట్టిపాడులో నేలవాలిన విద్యుత్ స్తంభాలు



నడింపాలెం పాఠశాల ఆవరణలో విరిగిపడిన చెట్ల కొమ్మలు

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఈదురుగాలులు బీభత్సం చేశాయి. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, ఈదురు గాలులతో వర్షం ప్రారంభమైంది. ఉదయం నుంచిక్కపోతతో ఉన్న వాతావరణం మారిపోయింది. ఈదురుగాలుల దెబ్బకు గుంటూరు, పర్చూరు రహదారిలో పలు చెట్లు నేలకొరి గాయి. భారీ హోర్డింగులు పడిపోయాయి. అంతేగాకుండా పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగి పడిపోయాయి. దీంతో మండలం మొత్తం పూర్తి అంధకారమైంది. తెగిన విద్యుత్‌వైర్లు పునరుద్ధరించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేశారు.

పెదనందిపాడు, మే, 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం భానుడి భగభగతో అల్లాడిన ప్రజలకు సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో ప్రధాన రహదారిలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో గంటలకొద్దీ ట్రాఫిక్, విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఏబీపాలెం, వరగాని గ్రామ సమీపంలో నేలకొరిగిన భారీ వృక్షాలను ప్రొక్లెయిన్ సహాయంతో ఎస్ఐ మధుపవన్, పోలీసు సిబ్బంది తొలగించారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

● కమిషనర్ కృతికా శుక్లాకు విద్యార్థి సంఘాల వినతి



కమిషనర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

తాడేపల్లి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కే.భాస్కర్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇంటర్మీడియేట్ విద్యా మండలి కార్యాలయంలో కమిషనర్ కృతికా శుక్లాను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పీఆర్వోలచే ఎడ్మిషన్లు చేయిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే కమర్షియల్ బిల్డింగుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యను వ్యాపార సంస్థగా మార్చేస్తున్నారని, కళాశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను అమ్ముతూ దోపిడీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి, నేతలు ఐ.రాజేష్, వీరేంద్ర ప్రసాద్, ధీరజ్, శివ పాల్గొన్నారు.

విశ్రాంత డీఎస్పీ విజయ్‌కుమార్ కన్నుమూత



బొప్పన విజయ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

మంగళగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): గతంలో మంగళగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన విశ్రాంత డీఎస్పీ బొప్పన విజయ్‌కుమార్ (75) బుధవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన భార్య విజయకుమారి 2022లో అనారోగ్యంతో మరణించింది. బొప్పనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వృత్తి రీత్యా పోలీసు శాఖలో అనేక ఉన్నత పదవులు అధిరోహించిన ఆయన తొలి నుంచి కమ్యూనిస్టు భావజాలంతో అభ్యుదయవాదిగా ఉన్నారు. నెల్లూరు వీఆర్ కళాశాలలో బీకాం చదివే రోజుల్లోనే అభ్యుదయ నాటికల్లో నటించి మెప్పించారు. తొలుత ఆర్మీలో చేరి, అనంతరం రైల్వే టీసీగా ట్రైనింగ్ తీసుకుంటుండగా ఎస్ఐగా సెలెక్టయి బాపట్ల, చందోలు, నిడుబ్రోలు, చిలకలూరిపేట, మంగళగిరి, మాచర్ల, విజయవాడలో సీబీసీఐడీ అధికారిగా పని చేసి, రైల్వేలో డీఎస్ఆర్పీగా విధులు నిర్వర్తించి 2008లో ఉద్యోగ విరమణ చేశారు. అమరావతి సాంస్కృతిక చైతన్య వేదిక అధ్యక్షుడిగా పనిచేసిన విజయ్‌కుమార్ మరణ వార్త తెలుసుకున్న పలువురు నాయకులు, అధికారులు మంగళగిరి ఇప్పటం రోడ్డు సమీపంలో ఉన్న ఆయన నివాసానికి వచ్చి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. రైతుసంఘం రాష్ట్ర నేత పీ నరసింహారావు, సీపీఎం నేతలు జేవీ రాఘవులు, మొసలి పకీరయ్య, చెంగయ్య, పీ బాలకృష్ణ, జొన్న శివశంకరరావు, పల్లె కృష్ణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమరావతి సాంస్కృతిక చైతన్య వేదిక కార్యదర్శి పీవీ రమణ, పీ సుధాకర్‌రావు, తదితరులు విజయ్‌కుమార్‌కు నివాళులు అర్పించారు.

తుళ్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా అప్పారావు

తుళ్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కాటా అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం తుళ్లూరులోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అమరావతి ఉద్యమం జరిగే సమయంలో ఎవరూ ముందుకు రాకపోవటంతో టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా అప్పారావు బాధ్యతలు చేపట్టాడు. అమరావతి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించాడు. తుళ్లూరులో ఉద్యమ శిబిరాన్ని సమర్థవంతంగా అప్పారావు నడిపాడు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయన మీద పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారు. పార్టీలో నిబద్ధతతో పని చేసే వారికి పదవులు దక్కుతాయని ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి పదవి పెండింగ్‌లో పడింది. బుధవారం టీడీపీ ప్రధాన కార్యదర్శి పదవికి రెండు వర్గాల నుంచి పోటీపడ్డారు. దీంతో సమావేశం కొంత సేపు రసాభాస అయ్యింది. ప్రస్తుతం ఆ ప్రధాన కార్యదర్శి ఎన్నిక వాయిదాపడింది.

వైభవంగా భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మంగళగిరి సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రబాలెంలో శ్రీభక్తాంజ నేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం ఐదు గంటలకు శ్రీభక్తాంజనేయ స్వామికి సుప్రభాతం, మంగళవాద్యయుత దేవోత్థాపన, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ద్వారపాలక, ఒంటె వాహన, జీవ, ధ్వజ, విమాన శిఖరాది పీఠారోహణం, ప్రథమార్చన, మహర్షి వేదన, ధ్వష్టి కుంభం, ధేను దర్శనం, కన్యా బ్రాహ్మణ నవధాన్య దర్శనం, మహాపూర్ణాహుతి గావించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, జనసేన నేత తిరుమలశెట్టి కొండలరావు, కూటమి నేతలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

తాడేపల్లి (కుంచనపల్లి), మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల నాయకుడు పల్లె కృష్ణ అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలో కుంచనపల్లి జాతీయ రహదారి వెంబడి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను జాతీయ రహదారి వద్ద పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు పంపిణీ చేశారు. సమ్మెలో పాల్గొనాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత

తాడేపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని టీటీ యార్డ్‌లో పనిచేసే సుమారు 200 మంది కార్మికులు ఈ నెల 20న జరిగే సమ్మెలో పాల్గొంటారని విధులకు రారని కాంట్రాక్టర్ మాధవరెడ్డికి సీఐటీయూ నేతలు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

22న హనుమాన్ శోభాయాత్ర

తెనాలి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఈ నెల 22న నిర్వహించనున్నారు. శోభయాత్ర కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. సుల్తానాబాద్ అంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణంలోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు జరిగే శోభాయాత్రను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. హిందూ ధార్మిక యువజన సంఘం అధ్యక్షుడు మారుతీశంకర్, రామాంజనేయులు, చిట్టిబాబు, కారంపూడి రమాదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

తెనాలి, మారీసుపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ఆటోను వేగంగా నడపవద్దన్నందుకు యువకుడిపై దాడిచేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శాంతినగర్‌కు చెందిన కుకుట్లపల్లి భరత్‌కుమార్ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తన అన్న కుమారుడి పుట్టిన రోజు వేడుకకు భార్యతో కలసి వెళ్తున్న సమయంలో ఫక్రుద్దీన్ ఆటోను వేగంగా నడుపుతూ పక్కనుంచి వెళ్లాడు. ఆటోను ఆపి ఫక్రుద్దీన్‌కు నెమ్మదిగా వెళ్ళాలని భరత్‌కుమార్ చెప్పడంతో గొడవ మొదలై ఘర్షణకు దారి తీసింది. దీనితో ఫక్రుద్దీన్ పాటు అతని స్నేహితుడు అన్నపురెడ్డి పవన్‌లు రాయితో భరత్‌కుమార్‌పై దాడిచేసి గాయపర్చారు. గాయపడిన భరత్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

సచివాలయ సిబ్బంది నిబంధనలు పాటించాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మే 14(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం, కొల్లిపర సచివాలయాలను ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని లేకపోతే తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

దాడిపై బాలుడి ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): అకారణంగా తనపై కొంతమంది దాడి చేశారంటూ బాలుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రెండవ పట్టణ పోలీసులు తెలిపారు. బుధవారం టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఐతానగర్ వైవీఆర్ కాలనీకి నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన బాలుడు వేసవి సెలవుల నిమిత్తం తన మేనమామ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో పరిసర ప్రాంతంలోని బాలురతో పరిచయం ఏర్పడింది. పిల్లలందరూ కలసి పోలేరమ్మ గుడి వద్ద సెల్‌ఫోన్‌లో ఆడుకుంటుండగా కొందరు యువకులు వచ్చి సెల్‌ఫోన్‌ను లాక్కొని అందులో అసభ్యకరమైన వీడియోలు ఉన్నాయంటూ బాలుడిపై కర్రలతో దాడిచేశారు. దీనితో బాలుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

వివాహానికి ఆర్థికసాయం

పొన్నూరుటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని 29వ వార్డుకు చెందిన షేక్ బాషా కుమార్తె వివాహానికి బుధవారం టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు ఆర్థికసాయాన్ని అందించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు అబ్దుల్‌కలాం షాదీఖానా నిధుల నుంచి రూ.5వేల ఆర్థిక సాయాన్ని బాషాకు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు అహ్మద్‌ఖాన్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాజీ సాహెబ్, రఫీ, బాజీ, షుకూర్, ఫైజుల్లాఖాన్, షేక్ షమీన్ తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరంగా తెప్పోత్సవం

పొన్నూరు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి తెప్పోత్సవం బుధవారం నయనానందకరంగా సాగింది. ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మ సరోవరంలో స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి ఉత్సవమూర్తులను సరోవరంలోని ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహన తెప్ప వాహనంపై ప్రతిష్టించి పూజలు జరిపారు. అనంతరం సరోవరంలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వామివారి విహారం జరిగింది. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


బ్రహ్మ సరోవరంలో విహరిస్తున్న భావదేవుడు

చురుగ్గా ఉపాధి పనులు

● రూ.16.20కోట్లతో 1,316 పనులు


బ్రాహ్మణకోడూరులో నిర్మాణంలో ఉన్న పంట కుంట

పొన్నూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పొన్నూరు మండలంలో చురుగ్గా సాగుతోంది. మండలంలో 23గ్రామాల్లో ఈ ఏడాది రూ.16.20కోట్ల వ్యయంతో 1,316 పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఐదు చెరువులు, 1,223 పంట కాల్వలు, సబ్ చానెల్స్, పంట పొలాల్లోకి నీరు ప్రవహించే కాల్వలు, 44 పంట కుంటలు, సోక్ పిట్లు నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ప్రతిరోజూ 3,250 పనిదినాలను అధికారులు కల్పిస్తున్నారు. ఇప్పటికే 153 పనులు పూర్తి చేశారు.


గాయంవారిపాలెంలో పంట కాలువలు అభివృద్ధి చేస్తున్న ఉపాధిశ్రామికులు

పంట కుంటలపై ప్రత్యేక దృష్టి..

పంట భూముల్లో సాగుకు అవసరమైన నీటిని నిల్వ ఉంచుకోవడం, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పంట కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోంది. పొన్నూరు మండలంలో 44, చేబ్రోలు మండలంలో 36, పెదకాకాని మండలంలో 57 ఫాం పాండ్‌ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. 5మీటర్ల వెడల్పు, 5మీటర్ల పొడవు, 2మీటర్ల ఎత్తు ఫారం పాండ్ నిర్మాణానికి 127 పనిదినాల్లో 3 సెంట్ల విస్తీర్ణంలో రూ.60వేల అంచనాలతో పనులు చేస్తున్నారు. గరిష్ఠంగా 15సెంట్ల భూమిలో 20 మీటర్ల వెడల్పు, 20మీటర్ల పొడవు, 2మీటర్ల ఎత్తు ఫారం పాండ్ నిర్మాణానికి 769 పనిదినాలు రూ.3.80లక్షల వ్యయం నిర్ణయించారు. ఫాం పాండ్‌ల నిర్మాణానికి ముందుకు వచ్చే రైతులకు ఉచితంగానే ఉపాధి శ్రామికులతో పనులు చేయిస్తున్నారు. అంతేకాకుండా పంట కుంటల చుట్టూ మొక్కలు పెంచుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారానే పండ్ల మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. అలాగే గత కొంతకాలంగా పంట కాల్వల్లో పూడికతీత పనులు చేయిస్తున్నారు. ఉపాధి హామీ పథకం పనులపై ఏపీవో సుభాషిణిని మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో లక్ష్యాలను అధిగమించేలా పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. 3480 మంది పనుల కోసం దరఖాస్తు చేసుకోగా 3,250 మంది ప్రతిరోజూ పనులకు హాజరవుతున్నట్లు వివరించారు.


చిరు వ్యాపారికి సూచనలు చేస్తున్న మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

● మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలి, మారీసుపేట,మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యూస్ స్టాల్ నిర్వాహకులు, చిరు వ్యాపారులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల ఆదేశించారు. బుధవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పలు స్వీట్ షాపులు, జ్యూస్ స్టాల్స్‌ను మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల అధికారులతో కలసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యూస్ స్టాల్ నిర్వాహకులు తాజా పండ్లను శుభ్రంగా కడిగి, జ్యూస్‌నుతీసి వినియోగదారులకు అందించాలన్నారు. స్వీట్ షాపు నిర్వాహకులు చేతులకు గ్లౌజులను వినియోగించాలని సూచించారు. తాజా తినుబండరాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని వాటిపై మూతలతో కవర్ చేయాలన్నారు. వ్యాపారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త రహిత తెనాలిని సాధిద్దాం

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్‌నిర్మల తదితరులు

తెనాలి, మారీసుపేట,మే 14 (ఆంధ్రజ్యోతి): చెత్త రహిత పట్టణంగా తెనాలిని సాధిద్దామని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. బుధవారం స్థానిక సాలిపేటలోని 17వ వార్డులో నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా డ్రెయిన్లలోని సిల్ట్ తొలగింపుపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. వార్డు ప్రజలు కూటా మూడు బుట్టల విధానాన్ని అనుసరించాలని తడిచెత్త పొడిచెత్త ప్రమాదకర వ్యర్థాలను ఇంటివద్దే పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. అనంతరం 15, 16 వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దివి అనిత, అన్నం పిన్నారావు, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


శలపాడు చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమాదేవి

శలపాడు చెరువు అభివృద్ధికి కృషి: ఎంపీడీవో

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే 14 (ఆంధ్రజ్యోతి): శలపాడు చెరువు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. మండల పరిధిలోని శలపాడు గ్రామంలో బుధవారం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా చెరువు అభివృద్ధికి పాటుపడతామన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, అమృత్ సరోవర్, పంచాయతీ నిధుల నుంచి చెరువును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. చెరువులో జంగిల్ క్లియరెన్స్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం వంటి పనులతో చెరువును అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఉపాధి సిబ్బంది ప్రతిరోజు పని కల్పించి గ్రామ సమస్యలు పరిష్కరించడమే కాకుండా కూలీలకు పని కల్పిస్తామన్నారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలత, స్వచ్ఛ భారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


శంభాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న హిందూ చైతన్య వేదిక, మరాఠ యువజన మండల్ సభ్యులు తదితరులు

ఘనంగా శంభాజీ మహారాజ్ జయంతి

తెనాలి, మారీసుపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): శంభాజీ మహారాజ్ జయంతి వేడుకలను హిందూ చైతన్య వేదిక, మరాఠ యువజన మండల్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక గాంధీచౌక్‌లోని నాలుగు కూడలి సెంటర్‌లో మరాఠా యోధుడు చావా శంభాజీ మహారాజ్ జయంతిని హిందూ చైతన్య వేదిక, మరాఠ యువజన మండల్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి హిందూ చైతన్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పొట్టి మూర్తి, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సంర్భంగా వారు మాట్లాడుతూ బతికితే శివాజీలా బతకాలని మరణిస్తే శంభాజీలా వీరుడిగా మరణించాలన్నారు. ఎన్ని ప్రలోభాలు పెట్టిన ఎంత చిత్రహింసలు చేసిన హిందూ ధర్మం వదలి ఇస్లాం మతం స్వీకరించడానికి నిరాకరించిన శంభాజీ మనకు ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో 30వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి, ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యదర్శి టి.హనుమాన్ ప్రసాద్, లక్ష్మీశ్రీనివాస్, భజరంగ్‌దళ్ బాలాజీ, బట్టీ సుధాకర్, సంతోష్, మహేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సక్రమంగా చెల్లించాలి

● డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

కొల్లిపర, మే 14 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపును సక్రమంగా చేసుకుంటే అధికంగా రుణాన్ని పొందటానికి అవకాశం ఉందన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం వలన సంఘాలు మరింత బలోపేతం అవటానికి అవకాశం ఉందన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, పూర్ణయ్య, ఎమ్ఎస్‌ఏ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సీబీఎస్‌ఈ పరీక్షల్లో వెస్ట్‌బెర్రి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ బోర్డు పరీక్ష ఫలితాల్లో వెస్ట్‌బెర్రి స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పదో తరగతి, 12వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. 12వ తరగతిలో ఎంపీసీలో కాత్విక 89శాతం, బైపీసీలో విద్యాగంగ 87.4శాతం, బీఈసీలో శిఖర్‌జైన్ 86శాతం మార్కులు సాధించారు. ఇన్‌ఫర్మేషన్ ప్రాక్టీసులో హిమజ, అక్షిత, కార్తీక, విద్యాగంగ, శ్రేయ నూరుశాతం మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ చెప్పారు. పదో తరగతిలో ఎం.నమ్రత 97.2 శాతం మార్కులు సాధించింది.

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తెనాలి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి కోరారు. పట్టణంలోని అన్నిరకాల కార్మిక సంఘాలు కలిసి బుధవారం సమ్మెకోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. కోట్లాదిమందికి జీవనోపాధి కల్పిస్తున్న రవాణా రంగాన్ని కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిర్వీర్యం చేస్తుందన్నారు. కొద్దిపాటి తప్పులకు భారీ జరిమానాలు విధించడం దుర్మార్గమన్నారు. రవాణారంగాన్ని కాపాడుకునేందుకు ఆటోడ్రైవర్లు, లారీ డ్రైవర్లు సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 20న మున్సిపల్ కార్యాలయం నుంచి జరిగే ప్రదర్శనలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ములకా శివసాంబిరెడ్డి, ముద్దన సాంబశివరావు, కరిముల్లా, మీరా, సుభాని పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో గ్రామస్థులకు వైద్యసేవలందిస్తున్న వైద్య సిబ్బంది

ఆహారంతో షుగర్ వ్యాధిని అదుపు చేయవచ్చు

● డాక్టర్ భరత్

తెనాలిరూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): సమతుల ఆహారంతో షుగర్ వ్యాధిని అదుపులో ఉంచవచ్చని డాక్టర్ భరత్ చెప్పారు. బుధవారం మండలంలోని కొలకలూరులో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్, ఫ్రెండ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ భరత్, డాక్టర్ మనోజ్ఞ, డాక్టర్ స్వాతి, డాక్టర్ నవదుర్గ, డాక్టర్ సంపత్‌లు పాల్గొని షుగర్, బీపీ, ఆర్థో, కన్ను, దంత ఇతర అనారోగ్య సమస్యలతో వచ్చిన గ్రామస్థులకు వైద్యపరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఆహార నియమాలు, వ్యాయామం వంటి వాటిని గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో మిల్క్‌యర్‌రాజ్, రంజిత్‌కుమార్, ఫ్రెండ్స్ ఫౌండేషన్ మేనేజర్ అఖిల్‌సాయి పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో ఎస్.మురళీధర్, స్వామి, కుసుమ, శామ్యూల్, సోలోమాన్, రవి, శ్యామ్ పలువురు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రకటనలతో సరి

● విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
● పట్టణంలోని పలు డ్రెయిన్లలో పేరుకుపోతున్న ప్లాస్టిక్
● కఠిన చర్యలు లేకుంటే పర్యావరణానికి ముప్పే


పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులతో నిండిన పట్టణంలోని చిట్టాంజనేయస్వామి రోడ్డు


తెనాలి- అంగలకుదురు రహదారిలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన కాలువ

తెనాలి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): చేయి చేయి కలుపుదాం.. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం అంటూ ప్రచారాలతో సమాజాన్ని చైతన్యవంతులను చేశామంటున్న తెనాలి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలకే పరిమితమైనట్లుగా కనిపిస్తోంది. పర్యావరణానికి హాని కలిగించడంలో ప్లాస్టిక్ మొదటి స్థానంలో నిలుస్తోందని పరిశోధనల్లో వెల్లడైంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన రోగాలకు కారకాలుగా ప్లాస్టిక్ ఉంది. భూమి, నీరు కలుషితమై తీవ్ర విపత్తుగా, భావితరాలకు పెను ప్రమాదంగా ప్లాస్టిక్ మారుతున్నదని పరిశోధకులు మొత్తుకుంటున్నా అటు ప్రజలకు గాని, వ్యాపారులు, అధికారులకు గాని చీమకుట్టినట్లు అయినా ఉండటంలేదు. తెనాలిలో రోజు రోజుకు పెరిగిపోతున్న నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై కఠిన చర్యలు కొరవడుతున్నాయి. పట్టణానికి వివిధ రకాల పనులమీద వేలామందిగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. తెనాలి మార్కెట్ ప్రాంతంలో కూరగాయలు, పండ్లు, నిత్యావసరాలను ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తుంటారు. వీటిని ప్యాక్ చేసి తీసుకువెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉండేలా పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు. అయితే ప్రభుత్వం తొలుత 75 మైక్రాన్ల కంటె తక్కువ మందం ఉన్న కవర్లను, ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడకూడదని జీవో జారీచేసింది. తిరిగి 120 మైక్రాన్లకు దాని పరిమితిని పెంచింది. నిషేధిత ఉత్పత్తులను వినియోగించకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చింది. దీంతో అధికార యంత్రాంగం ప్రతి రోజు నిత్యావసరాల దుకాణాలకు, కూరగాయల విక్రయ వ్యాపారుల వద్దకు, హోటల్ నిర్వాహకులు, మాంసం విక్రయదారులు ఇలా అన్ని రకాల వారి వద్దకు వెళ్లి ప్లాస్టిక్ పెను భూతంపై ప్రజలకు వివరించి వాటి వినియోగాన్ని నిలిపివేద్దామని ప్రతిజ్ఞలు కూడా చేయించారు. అయితే గత కొంతకాలంగా మునిసిపల్ అధికారులు ప్లాస్టిక్ మహమ్మారిపై వ్యవహరిస్తున్న తీరు పలు ఆరోపణలకు తావునిస్తోంది. ఫంక్షన్లలో తాగునీరు, జ్యూస్ స్టాల్స్‌లో జ్యూస్, చెరుకు రసం, నిమ్మకాయ సోడా, సుగంధసోడా, బాదంపాలు వంటివి తాగించేందుకు ప్లాస్టిక్ గ్లాసులనే వినియోగిస్తున్నారు. అంతేకాకుండా మద్యం షాపుల వద్ద కూడా డిస్పోజ్ ప్లాస్టిక్ గ్లాసులను వినియోగించడం పరిపాటిగా మారింది. కర్రీస్ పాయింట్లలో కూడా వేడి వేడి కూరలను తక్కువ మందం కలిగిన కవర్లలోనే నింపి పార్సిల్స్ ఇస్తున్నారు. అదే విధంగా టీ స్టాల్స్ నిర్వాహకులు సైతం వేడి వేడి టీ, పాలు, బూస్ట్, హార్లిక్స్ వంటివాటిని కూడా కవలర్లలోనే పార్సిల్ ఇస్తున్నారు. వీటివల్ల క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నా ఎవ్వరూ దీని గురించి పట్టించుకోవటం లేదు. ఇక కవర్లలో ఉత్పత్తులను ఇంటికి తీసుకువచ్చిన వినియోగదారులు వాటిని రోడ్లపై, కాలువలో వేయడంతో అవి పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉంటూ పర్యావరణానికి ముప్పుగా, వర్షాలు వచ్చినప్పుడు ముంపునకు కారణమవుతున్నాయి. అంతేకాకుండా ఉపాధి దెబ్బతింటున్నదనే నెపంతో ప్లాస్టిక్ కవర్లు తయారీ పరిశ్రమలపై చర్యలు చేపట్టకుండా, వాటి తయారీని నియంత్రించకుండా ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం శూన్యంగానే ఉంటుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఇటు పర్యావరణానికి అటు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా ఉన్న ప్లాస్టిక్‌పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


పాలిథిన్ కవర్లో తీసుకువెలుతున్న పాలప్యాకెట్లు


పాలిథిన్ కవర్‌లో పండ్లను తీసుకువెళుతున్న మహిళ